RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 11 ఆగస్ట్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:63

# వర్షాల కోసం వరుణ యాగం..

## సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం**
**నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు**
**ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు**
**యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం**





రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11 హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు.

ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది సుమారు 518 అడుగుల వద్దే కొనసాగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిండి అన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

# విద్యార్థుల నిరసనలపై అమిత్ షా మాట్లాడతారు..

## పార్లమెంట్‌లో కేంద్రం హామీ

**విద్యార్థులపై పోలీసుల చర్యపై పార్లమెంట్‌లో మాట్లాడనున్న అమిత్ షా**
**ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చకు సిద్ధమైనట్లు ప్రభుత్వం ప్రకటన**
**ప్రతిపక్షాలు గందరగోళం చేయొద్దని రిజిజు విజ్ఞప్తి**
**జూన్ 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసన**
**వారిపై పోలీసుల చర్యలను తీవ్రంగా తప్పుబట్టిన ప్రతిపక్షాలు**
**పెల్లెట్ గన్స్ వాడినట్లు వచ్చిన వార్తలపై అభ్యంతరం**



ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యలపై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సమాధానం ఇవ్వనున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం పూర్తిస్థాయి చర్చకు సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సోమవారం ప్రకటించారు. దీంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న పార్లమెంట్ ప్రతిష్ఠంభనకు తెరపడే అవకాశం కనిపిస్తోంది.

విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రిజిజు తెలిపారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశానికీ ప్రభుత్వం సమాధానం ఇస్తుందని చెప్పారు. ముఖ్యంగా హోంమంత్రి అమిత్ షా సభలో ఈ అంశంపై స్పందిస్తారని స్పష్టం చేశారు.

అయితే అమిత్ షా ప్రకటన సమయంలో ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించకూడదని రిజిజు కోరారు. హోంమంత్రి సమాధానాన్ని పూర్తిగా వినాలని సూచించారు. చర్చ మొదలైన తర్వాత ప్రతి అంశంపైనా విస్తృతంగా మాట్లాడవచ్చని చెప్పారు.

జూన్ 20న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల నిరసనపై పోలీసులు తీసుకున్న చర్యలను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. విద్యార్థులపై పోలీసులు అతిగా వ్యవహరించారని ఆరోపిస్తున్నాయి. పెల్లెట్ గన్స్ వాడినట్లు వచ్చిన వార్తలపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ చర్యలు అమిత్ షా ఆదేశాలతో జరిగాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

అమిత్ షా నుంచి సమాధానం కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభలో వరుసగా నిరసనలు చేపడుతున్నారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే నినాదాలతో కార్యకలాపాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ గేట్ల వద్ద కూడా ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి.

# ప్రజాప్రభుత్వంలో పార్టీలకతీతంగా అన్ని నియోజకవర్గాలకు

## సమాన అభివృద్ధి..సమాన ప్రాధాన్యత మంత్రి పొంగులేటీ

**ప్రతిపక్షపార్టీ నాయకులు పొర్లుదండాలు పెట్టిన ప్రజాప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆగవు**

సోమవారంనాడు ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , హనుమకొండ జిల్లా కలెక్టర్, సంబంధిత ఆయా శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి హనుమకొండ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి అందులో



భాగంగా మొదట ఎల్కతుర్తి మండల కేంద్రంలో రూ.3.23 కోట్లతో నిర్మించ తలపెట్టిన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అనంతరం మండల కేంద్రంలో రూ. 3.25 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (KGBV) నూతన భవనాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా విధ్యార్థినులకు ప్రభుత్వం అందించే హాస్టల్ లో అవసరమయ్యే వస్తువులను అందించడం జరిగింది. ఈ వేదికగా ౹ాజ మరియు



ఇంటర్ ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విధ్యార్థినులను సత్కరించడం జరిగింది. అదేవిధంగా హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలంలో గూడూరు, కమలాపూర్, మర్రిపెల్లిగూడెం గ్రామాలకు చెందిన 394 డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్దిదారులకు కేటాయించే పట్టాలు పంపిణీ చేయడం జరిగింది.

పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన సొంటిటికలను ప్రజాప్రభుత్వం సహకారం చేస్తుంది. పల్లె, పట్టణం తేడా లేకుండా కుల,మత, రాజకీయాలకతీతంగా అరులైన పేదలందరికీ ఇండ్లను అందిస్తున్నాం. ఏలాంటి పక్షపాతం లేకుండా గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు వందల కోట్ల నిధులు కేటాయించి నిర్మాణాలు, మౌళికవసతులను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తున్నాం.

ఎన్నో ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని గత 10 ఏళ్ళ పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ ఆర్థిక విధ్వంసం చేసింది. రాష్ట్ర అభివృద్ధిని, పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి అప్పుల ఊబిలోకి నెట్టింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే కనీవినీ ఎరుగనిరీతిలో ప్రజాసంక్షేమం కోసం ఎన్నో అద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టి ముందుకు సాగుతుంది అని మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు

# ఝార్ఖండ్‌లో టెన్షన్.. బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు..

## వాటర్ కేనన్‌ల ప్రయోగం



వార్తా 2 లో

ప్రజాబలం

11 ఆగస్ట్ 2026 మంగళవారం

# ఎఫ్ సీఆర్ ఏ సవరణ బిల్లులో బిగ్ ట్విస్ట్.

భారతదేశంలో చట్టాలు రూపొందించడం, వాటిపై చర్చించడం పార్లమెంటు, రాజకీయ పార్టీల నేతల పరిధిలోనిదే. అభ్యంతరాలు ఉంటే అవి సభల్లోనే వ్యక్తం కావాలి. దీనికి విరుద్ధంగా విదేశీ నేతలు స్పందించడం అంతర్గత వ్యవహారాల్లో జోక్యంగా పరిగణించబడుతుంది. ఇటీవల ఎఫ్‌సీఆర్‌ఏ సంబంధిత బిల్లు విషయంలో ఇదే సూత్రాన్ని భారత్ స్పష్టం చేసింది.ఈ బిల్లు విదేశీ నిధుల రాకపోకలపై నియంత్రణను మరింత కఠినం చేసే దిశగా ఉంది. సంస్థలు నిధుల మూలాలు, ఖర్చుల వివరాలు స్పష్టంగా నివేదించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆస్తులు జప్తు చేసే అధికారం కేంద్రానికి ఉంటుంది. దీని ద్వారా అంతర్గత భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై నియంత్రణ సాధ్యమవుతుందని ప్రభుత్వ వైపు నుంచి వాదన ఉంది. రాజకీయ చర్చలు ఈ అంశం చుట్టూనే తిరగనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఈ బిల్లు ఆమోదంపై దృఢంగా ఉన్నారని సూచనలు వస్తున్నాయిఈ ప్రక్రియపై అమెరికా సెనేటర్ రైలీ మూర్ వ్యతిరేకత వ్యక్తం చేశారు. భారత్‌లో క్రైస్తవులు సెయింట్ థామస్ కాలం నుంచి ఉన్నారని, వేల సంవత్సరాల చరిత్ర ఉందని చెబుతూ, ఎఫ్‌సీఆర్‌ఏ ద్వారా వారిని నియంత్రించాలని ప్రయత్నం జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నంగా కనిపించాయి. అయితే అమెరికాలోనే అమలులో ఉన్న ఇలాంటి నియంత్రణల గురించి ఆయన ప్రస్తావించలేదు. భారత్ నుంచి అమెరికాలోని ఇస్కాన్ వంటి సంస్థలకు నిధులు వెళ్తే అవి అమెరికా నిబంధనలకు లోబడి లెక్కలు చూపాల్సి ఉంటుంది. ఇదే తరహా జవాబుదారీతనం భారత్‌లోనూ అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ బిల్లు వస్తోంది.విదేశీ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందించారు. ఇది పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని, బయటివారు స్పందించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇలాంటి స్పష్టత అమెరికాకు అసౌకర్యం కలిగించవచ్చు. యూరప్ నేతలు కూడా ఇలాంటి సందర్భాల్లో సాధారణంగా జాగ్రత్తగా ఉంటారు. అయినా భారత్ తన సార్వభౌమత్వాన్ని నొక్కి చెప్పింది. రైలీ మూర్ ట్రంప్‌కు సన్నిహితుడని, ఆయన ద్వారా సందేశం వస్తున్నట్లు కొందరు అంచనా వేస్తున్నా, అధికారికంగా ఇది ఒక సెనేటర్ వ్యక్తిగత అభిప్రాయంగానే చూడాలి.ప్రతి దేశం తన భద్రత, నిధుల పారదర్శకత కోసం చట్టాలు తీసుకురావడం సహజం. వివాదాస్పద విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు?2026పై కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. ఈ బిల్లును గత కాలానికి (రెట్రోస్పెక్టివ్‌గా) వర్తింపజేయబోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లు మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా వెల్లడించారు. మిజోరం చర్చి నాయకుల ప్రతినిధి బృందంతో కలిసి అమిత్ షాను కలిసిన అనంతరం ఆయన ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. ఈ బిల్లును ఆగస్టు 12న పార్లమెంట్‌లో చర్చించి ఆమోదానికి తీసుకురానున్నట్లు హోంమంత్రి వెల్లడించినట్లు చెప్పారు.ప్రతిపాదిత ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు విదేశీ నిధులు స్వీకరించే స్వచ్ఛంద సంస్థలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రద్దు అయిన, గడువు ముగిసిన లేదా స్వచ్ఛందంగా వదులుకున్న సంస్థలకు చెందిన విదేశీ నిధులు, వాటితో కొనుగోలు చేసిన ఆస్తులను ప్రభుత్వం నియమించే ప్రత్యేక అధికార సంస్థ ఆధీనంలోకి తీసుకునే విధంగా కొత్త నిబంధనలు తీసుకురావాలని బిల్లు ప్రతిపాదిస్తోంది.అయితే ఈ చట్టాన్ని గతానికి వర్తింపజేస్తే నిజాయితీగా పనిచేస్తున్న సంస్థలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా, మిజోరం కోహ్రాన్ హ్రుయితు కమిటీ, మిజోరం చర్చిల మండలి ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పరిపాలనా లేదా సాంకేతిక లోపాల కారణంగా స్వచ్ఛంద సంస్థలు శిక్షార్హులుగా మారే అవకాశం ఉందని పేర్కొంటూ, ఈ చట్టాన్ని భావి కాలానికి మాత్రమే వర్తింపజేయాలని కేంద్రాన్ని కోరారు. దీనిపై స్పందించిన అమిత్ షా, బిల్లు గతానికి వర్తించదని హామీ ఇచ్చినట్లు లాల్దుహోమా తెలిపారు.ఇదే సమయంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభనను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసింది. కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుతో పాటు ఇతర చట్టాలపై చర్చ జరిగేలా ప్రతిపక్షాలతో సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ఫోన్‌లో మాట్లాడి సహకారం కోరారు. గత పది రోజుల్లో పలుమార్లు ఇరు నేతల మధ్య చర్చలు జరిగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.కాంగ్రెస్ మాత్రం కీలక బిల్లులపై ముందుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. అయితే దీనిపై కేంద్రం ఇప్పటివరకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. మరోవైపు 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసే దిశగా రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రభుత్వం ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నాలు చేస్తోంది. అలాగే 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కు పెంచే డీలిమిటేషన్ ప్రతిపాదనపైనా రాజకీయ పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ కీలక బిల్లులపై ఆగస్టు 12న జరిగే పార్లమెంట్ చర్చ దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అమెరికా తన భూభాగంలో విదేశీ నిధులపై నియంత్రణలు పెట్టుకుంటే, భారత్‌లోనూ అదే హక్కు ఉంది. ఒకవైపు స్వేచ్ఛ, మత స్వాతంత్ర్యం గురించి మాట్లాడుతూ, మరోవైపు మరొక దేశం యొక్క నియంత్రణ చర్యలను లక్ష్యంగా చేసుకోవడం ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తుంది. ఎఫ్‌సీఆర్‌ఏ కేవలం ఒక మతాన్ని లక్ష్యం చేసుకోవడం కాదు.. అన్ని సంస్థలకు వర్తించే సాధారణ నిబంధనలు. అంతర్గత శత్రువులు లేదా అపారదర్శక నిధుల మార్గాలను అడ్డుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం.మొత్తంగా చూస్తే, ఈ వివాదం భారత్ తన స్వాతంత్ర్యాన్ని, చట్టపరమైన సార్వభౌమత్వాన్ని ఎలా కాపాడుకుంటుందో చూపిస్తోంది. విదేశీ అభిప్రాయాలు ఉండవచ్చు, కానీ నిర్ణయాలు భారత ప్రజలు, వారి ప్రతినిధులు తీసుకోవాలి. ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు ఆమోదం పొందితే నిధుల పారదర్శకత పెరుగుతుంది.

# సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు అందించాలి:

## టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్




సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప వీరుడు, ధైర్యసాహసాలకు ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ధర్మ పరిపాలన సంస్థ, జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతి వేదికగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో మహేష్ కుమార్ గౌడ్ పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా "మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూలి.. సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక యోధుడు మాత్రమే కాదని, అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాన్య ప్రజల గౌరవం కోసం పోరాడిన ప్రజా నాయకుడని పేర్కొన్నారు. తన కాలంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటూ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారని అన్నారు.

ప్రజల కోసం పోరాడాలి.. అన్యాయాన్ని ఎదిరించాలి.. సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలి అనే స్ఫూర్తిని సర్వాయి పాపన్న గౌడ్ తన జీవితంతో చాటిచెప్పారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆయన ధైర్యం, నాయకత్వ లక్షణాలు, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.

చరిత్రలో ఎన్నో గొప్ప పోరాటాలు జరిగినప్పటికీ, పలువురు మహనీయులకు తగిన గుర్తింపు లభించలేదని ఆయన పేర్కొన్నారు. అలాంటి మహనీయుల చరిత్రను వెలుగులోకి తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

జయంతి ఉత్సవాలు కేవలం వేడుకలకే పరిమితం కాకూడదని, మహనీయుల ఆశయాలను జీవితంలో ఆచరించడమే వారికి అందించే నిజమైన నివాళి అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

యువత సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని, ఆయన చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, నాయకత్వ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మధు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రామరావు గౌడ్, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తు గడువు పొడిగింపు

**ఆగస్టు 15 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**ఇప్పటివరకు 46,121 దరఖాస్తులు**

**వరుస సెలవుల నేపథ్యంలో మరో ఐదు రోజులు అవకాశం**

**గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీపొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 10: హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు తెలిపారు. ఆగస్టు 15వ తేదీ శనివారం వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చి, నామమాత్రపు ధరలోనే పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం ద్వారా లక్ష ఇళ్లను నిర్మిస్తున్నామని, అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని ఆయన వివరించారు.

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్కు ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే రెండో శనివారం, బోనాల పండుగ తదితర వరుస సెలవుల కారణంగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా గడువు పొడిగించాలంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగించి ఆగస్టు 15 వరకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.

తొలుత ప్రకటించిన ప్రకారం దరఖాస్తుల స్వీకరణ గడువు ఆగస్టు 10, సోమవారం వరకు ఉంది. గత నెల జూలై 21వ తేదీ నుంచి మీ-సేవా కేంద్రాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా, మీ-సేవా వాట్సాప్ సేవ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆగస్టు 10, సోమవారం సాయంత్రం నాటికి మొత్తం 46,121 దరఖాస్తులు అందినట్లు మంత్రి తెలిపారు.

వరుసగా సెలవులు రావడంతో మరింత మంది అర్హులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో గడువు పొడిగించినట్లు మంత్రి పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచినప్పటికీ, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, కేటాయింపు, లాటరీ తదితర ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెలాఖరు నాటికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై దరఖాస్తుదారులు ఎటువంటి అపోహలు, అనుమానాలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులు

| నియోజకవర్గం | దరఖాస్తులు |
|---|---|
| అంబర్‌పేట | 3,073 |
| బహదూర్‌పుర | 1,706 |
| ఇబ్రహీంపట్నం | 1,031 |
| కార్వాన్ | 2,184 |
| ఖైరతాబాద్ | 5,518 |
| కూకట్‌పల్లి | 6,615 |
| మహేశ్వరం | 734 |
| మలక్‌పేట | 3,609 |
| మల్కాజిగిరి | 1,333 |
| మేడ్చల్ | 1,668 |
| నాంపల్లి | 4,372 |
| కుత్బుల్లాపూర్ | 5,571 |
| రాజేంద్రనగర్ | 2,060 |
| సనత్‌నగర్ | 1,404 |
| సికింద్రాబాద్ (కంటోన్మెంట్) | 1,755 |
| శేరిలింగంపల్లి | 3,488 |
| మొత్తం | 46,121 |

# ఝార్ఖండ్‌లో టెన్షన్.. బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు.. వాటర్ కేనన్‌ల ప్రయోగం

ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం

బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్

అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు

పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు

13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్

ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాటడంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో కనిపించింది.

నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు.

అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల మార్చ్ నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలపై బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాంచీలో చాలా పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.

16 రోజులుగా ఆందోళన

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

# కర్రెగుటల్లో డీజీపీ పర్యటన.



**ఏటూరునాగారం ప్రజాబలం ప్రతినిధి.** వాజేడు ఆగస్టు 10

కర్రెగుటలో అభివృద్ధికి సువర్ణ అధ్యాయానికి డిజిపి అడుగులు.

హింసకు స్వస్తి.. సమాజంలో భాగస్వామ్యం కావాలని డిజిపి సివి ఆనంద్ సందేశం.

లొంగిపోవాలని గణపతి దంపతులకు పోలీసుల పిలుపు.

కాకరాల సమత కి 20 లక్షల రూపాయల చెక్ అందజేత.

పునరావాస విధానంతో ఇప్పటివరకు లొంగిపోయిన 23 మందికి రూ.2 కోట్ల వరకు సాయం.

ఆపరేషన్ కగార్ తో తెలంగాణ ఆంధ్ర చత్తీస్గడ్ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న కర్రెగుట్టలను జల్లెడ పట్టిన భద్రతా బలగాల కృషి వమ్ము కాలేదు. నాడు కర్రెగుట్టల దండకారణ్యంలో తుపాకుల మోతలతో తూటాల వర్షం కురిసి రక్తమోడిన నేల నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో లొంగిన మావోయిస్టుల కంచుకోటలో నేడు అభివృద్ధికి బాటలు పడుతున్నాయి.

ఏప్రిల్ 7న కర్రెగుటలలోని సిఆర్పిఎఫ్ 39 పామూనురు బెటాలియన్ ను అప్పటి డిజిపి బి.శివధర్ రెడ్డి సందర్శించి మారుమూల ప్రాంతాల అభివృద్ధి నాంది పలికితే.. సోమవారం కర్రెగుట్టల పర్యటనకు వచ్చిన డీజీపీ సివి ఆనంద్ మరో అడుగు ముందుకు వేసి పామూనురు బెటాలియన్ ను దాటి చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28 కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి కర్రెగుటలలో శాశ్వత అభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.

డీజీపీ పర్యటన సాగిందిలా..

డీజీపీ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కర్రేగుట్టల్లో ఆయన పర్యటించారు. ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్న డిజిపి జిల్లాలోనే బస చేసి సోమవారం ఉదయం పాముమూరు 39 సిఆర్పిఎఫ్ బేస్ క్యాంపునకు చేరుకున్న ఆయన పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

అక్కడి నుంచి కర్రేగుట్టల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. పాముమూరు, చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి అక్కడ జెండా ఎగురవేసి, శాంతికపోతాలని గాల్లోకి వదిలారు. ఈ క్రమంలో అక్కడ పనుల్లో అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.పాముమూరులో నివాసం ఉంటున్న గుత్తి కోయలకు బియ్యం, దుప్పట్లు అందజేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పునరావాస విధానాలతోనే భారీ సంఖ్యలో మావోయిస్టుల లొంగుబాటు.

ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మావోయిస్టుల అణచివేతలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యూహాత్మకంగా అడుగులు వేశామని తెలిపారు. మావోయిస్టుల కంచుకోటలుగా ఉన్న ప్రాంతాలను ఖాళీ చేయించామని, కొందరు ఎన్కౌంటర్లలో మృతి చెందగా.. ప్రభుత్వం తీసుకొచ్చిన పునరావాస విధానాలతో భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కూడా అందించామని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతం అరణ్య ప్రాంతమైనప్పటికీ అటవీశాఖతో కలిసి చూడదగ్గ ప్రదేశాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని డీజీపీ వెల్లడించారు.

40 ఏళ్ల మావోయిస్టు జీవితం.. జనజీవన స్రవంతిలోకి..

దాదాపు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో అండర్గ్రౌండ్లో కొనసాగిన సీపీఐ (మావోయిస్టు) సీనియర్ నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి, షకీలా, దుర్గా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ములుగులో డీజీపి సీవీ ఆనంద్ విలేకరుల సమావేశంలో ఆమె నేపథ్యం, పార్టీ బాధ్యతలు, కుటుంబ వివరాలు, ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సదుపాయాలను వెల్లడించారు.

1985లో అండర్గ్రౌండ్లోకి..

1985లో వైజాగ్ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలకు ప్రభావితమైన సమత అండర్గ్రౌండ్లోకి వెళ్లినట్లు డీపిజీ తెలిపారు. అప్పటి నుంచి సుమారు 40 ఏళ్లపాటు వివిధ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీకి పనిచేశారన్నారు. హైదరాబాద్ కమిటీలో సుమారు పదేళ్లు, నల్లమలలో నాలుగేళ్లు, ఉత్తరప్రదేశ్ ఏరియా కమిటీలో రెండేళ్లు, గుజరాత్ గోల్డెన్ కారిడార్ కమిటీ' లో రెండేళ్ళు, మహారాష్ట్ర ఏరియా కమిటీలో ఐదేళ్లు, కర్ణాటక--మహారాష్ట్ర ఉమ్మడి కమిటీలో పదేళ్లు పనిచేసినట్లు వివరించారు.

పార్టీ డాక్యుమెంటేషన్లో కీలక పాత్ర

సమత సాయుధ కార్యకలాపాలతో పాటు పార్టీ సిద్ధాంతపరమైన, డాక్యుమెంటేషన్ బాధ్యతలు నిర్వహించినట్లు డిజిపి తెలిపారు. సెంట్రల్ కమిటీ తీర్మానాలు, పార్టీ పత్రాల రూపకల్పన, సిద్ధాంతపరమైన అంశాల రచన, అనువాదాలు, మహిళా సమస్యలపై వ్యాసాల రచన, క్యాడర్కు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలు చేపట్టారన్నారు. మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతికి సీసీ స్టాఫ్ మెంబర్గా కూడా పనిచేసినట్లు సమత వెల్లడించిందన్నారు.

కుటుంబంలోనూ మావోయిస్టు నేపథ్యం

సమత సోదరి కాకర్ల సునీత అలియాస్ బద్రి కూడా సీనియర్ మావోయిస్టు నాయకురాలిగా పనిచేసి గత ఏడాది తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు డీజీపి తెలిపారు. మరో కజిన్ సోదరి కాకర్ల పద్మ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మావోయిస్టు కార్యకలాపాల్లో పనిచేసిందన్నారు. 2018లో అరెస్టయిన ఆమె ప్రస్తుతం బెయిల్పై చెన్నైలో ఉంటున్నట్లు వెల్లడించారు.సమత భర్త పటేల్ సుధాకర్రెడ్డి మావోయిస్టు పార్టీలో సీనియర్ క్యాడర్గా, మిలిటరీ కమిషన్, పార్టీ ఇంటెలిజెన్స్ విభాగాల్లో కీలకంగా పనిచేసినట్లు డీజీపి తెలిపారు. 2010లో జరిగిన ఎదురుకాల్పుల్లో సుధాకర్రెడ్డి మృతి చెందినట్లు చెప్పారు.

సరెండర్ క్యాడర్కు ప్రభుత్వం అండ

మావోయిస్టుల పునరావాసంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని డిజిపి సీవీ ఆనంద్ తెలిపారు. సరెండర్ అయిన వారికి ఆర్థిక సాయం, సామాజికంగా స్థిరపడేందుకు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ఉచిత వైద్య చికిత్స కోసం ఆరోగ్య రక్షణ కార్డులు జారీ చేసి పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

ఉపాధి.. శిక్షణ.. రుణాలు

సరెండర్ అయిన వారు గౌరవప్రదంగా జీవించేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని డిజిపి తెలిపారు. వృత్తి లేదా వ్యాపారం చేయాలనుకునే వారికి శిక్షణతో పాటు రుణాలు అందించి స్వయం ఉపాధికి సహకరిస్తామన్నారు. ఆరోగ్య, కేసులు లేదా ఇతర సమస్యలు ఉంటే పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. సరెండర్ అయిన వారిని పూర్తిగా జనజీవన స్రవంతిలో కలపడం పునరావాస విధానం లక్ష్యమన్నారు.

23 మందికి రూ.2 కోట్ల వరకు సాయం

పునరావాస విధానం కింద ఇప్పటికే 23 మంది సరెండర్ అయిన మావోయిస్టులకు దాదాపు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు డిజిపి తెలిపారు. సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ, పార్టీ మెంబర్ లేదా ఇతర క్యాడర్ అనే తేడా లేకుండా సరెండర్ తర్వాత సాధారణ జీవితంలో స్థిరపడేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు.

గణపతి దంపతులకు పోలీసుల పిలుపు

మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, ఆయన భార్యతో పాటు అండర్గ్రౌండ్లో ఉన్న సీనియర్ నాయకత్వం హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు.

ములుగులోనే సమావేశం ఎందుకంటే..

మావోయిస్టు కార్యకలాపాలకు గతంలో కీలకంగా ఉన్న ప్రాంతం కావడంతో హైదరాబాద్కు బదులుగా ములుగులో కార్యక్రమం నిర్వహించినట్లు డిజిపి సివి ఆనంద్ తెలిపారు. తెలంగాణ--ఛత్తీస్గఢ్ మధ్య దట్టమైన అటవీ ప్రాంతం గతంలో మావోయిస్టు కార్యకలాపాలకు కారిడార్గా ఉండేదని, ఈ ప్రాంతంలో పర్యటించి సరెండర్ క్యాడర్తో నేరుగా మాట్లాడినట్లు చెప్పారు. వారి సమస్యలు, పునరావాస విధానంలోని లోపాలు, కేసుల సమస్యలను తెలుసుకున్నామని, అవసరమైతే కేంద్ర, ఛత్తీస్గఢ్ ప్రభుత్వాలతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.

హింసకు స్వస్తి.. సమాజంలో భాగస్వామ్యం కావాలి

మావోయిస్టులు హింసా మార్గాన్ని విడిచి సమాజంలో కలిసిపోవాలని డిజిపి సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. సరెండర్ అయిన వారు తిరిగి అండర్గ్రౌండ్ బాట పట్టకుండా కుటుంబాలతో కలిసి గౌరవప్రదమైన జీవితం గడిపేలా చేయడమే ప్రభుత్వ పునరావాస విధానం లక్ష్యమన్నారు.

“సరెండర్ అయిన వారికి ఏ సహాయం కావాలన్నా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఉపాధి, శిక్షణ, రుణాలు, ఆరోగ్య సమస్యలకు వైద్య సాయం అందిస్తాం. వారు సాధారణ పౌరులుగా జీవించాలన్నదే మా ప్రధాన ఉద్దేశం” అని తెలిపారు.

కర్రెగుట్టలో పర్యటనలో డిజిపి సివి ఆనంద్ తో పాటు మల్టీజెన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా, సిఆర్పిఎఫ్ ఎడిజి విక్రమ్ సింగ్, ఇంటెలిజెన్స్ ఎస్పి సింధు శర్మ, ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, డి ఎఫ్ ఓ వికాస్ మీనా, ఏ ఎస్ పి మనన్ భట్ ఐపిఎస్ తదితరులు పాల్గొన్నారు.

పి ఆర్వో

ములుగు జిల్లా పోలీస్.

# తల్లాడలో విజయదుర్గ రైస్ ఇండస్ట్రీ నిర్వాకం

**ప్రభుత్వ ధాన్యం మాయం చేసిన రైస్ మిల్లు యజమాని అరెస్ట్**

**7.7 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం పక్కదారి.**



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 ప్రజాబలం:**ఖమ్మం జిల్లా తల్లాడ కేంద్రంలోని కొత్తగూడెం వెళ్లే రోడ్డులో ఉన్న విజయ దుర్గ రైస్ మిల్ ఇండస్ట్రీలో 7.7 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. విజిలెన్స్,సివిల్ సప్లై అధికారుల సంయుక్త తనిఖీలలో ఈ భారీ అక్రమం వెలుగు చూసింది, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ విజిలెన్స్ సిఐ కిషోర్,ఎమ్మార్వో భాస్కర్,డీటీలు విజయబాబు, నరేష్ యూనిట్ ఖమ్మం సివిల్ సప్లై అధికారులు ఆదివారం రాత్రి సదర్ రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.2025-26 ఖరీఫ్ రబి సీజలకు సంబంధించిన మిల్లుకు అప్పగించిన ప్రభుత్వ ధాన్యం రికార్డులను భౌతిక విలువలను పరిశీలించారు. ఈ తనిఖీలలో 2.449.384 మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పక్కదారి పట్టిన ధాన్యం విలువ సుమారు 7.7 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. దీనిపై తల్లాడ సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విజయదుర్గ రైస్ ఇండస్ట్రీస్ యజమాని బండారు నరసింహారావు పై భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 316(5) 318(4) ఏసేన్షియల్ కమిడిటీస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు బండారు నరసరావును అరెస్ట్ చేసి కోట్లు హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు వైరా సీఐ వెంకట ప్రసాద్ తెలిపారు.

# పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం.. యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన

**పన్నుల సవరణ బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం**

**యూపీఐ లావాదేవీలపై వినియోగదారులకు ఛార్జీలు లేవని నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ**

**మర్చంట్ డిస్కౌంట్ రేట్పై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్రం**

**భవిష్యత్తులో ఛార్జీలు వచ్చినా వ్యాపారులకే, అదీ పెద్ద లావాదేవీలకే వర్తింపు**

**రోజువారీ కొనుగోళ్లు 90 శాతం ఉచితంగానే కొనసాగుతాయని వెల్లడి**



యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారులకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు.

గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు.

మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు.

భవిష్యత్తులో ఒకవేళ ఎండీఆర్‌ను ప్రవేశపెట్టినా, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన అధిక విలువ గల వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే స్పష్టం చేసింది. పాలు, కూరగాయలు, కిరాణా వంటి 90 శాతానికి పైగా రోజువారీ కొనుగోళ్లు వ్యాపారులకు కూడా ఉచితంగానే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ, 2020 జనవరి నుంచి ఉచిత సేవలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపు వ్యవస్థగా అవతరించింది.

# పిఠాపురంలో రోడ్లకు మహర్దశ

కాకినాడ, ఆగస్టు 10, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా పల్లెల నుంచి పట్టణాల వరకు మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా రహదారుల పునర్నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసమే ఏకంగా రూ. 200 కోట్లకు పైగా నిధులను వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంతో మొత్తం 307 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణ ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో 152 కిలోమీటర్ల మేర 611 రోడ్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. నిర్ణీత లక్ష్యంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి కావడంతో పిఠాపురం నియోజకవర్గంలో రవాణా వ్యవస్థ రూపురేఖలు మారిపోయి గ్రామాల్లో కొత్త కళ సంతరించుకుంది.రహదారుల నిర్మాణంలో ప్రజల, రైతులు, మత్స్యకారుల అవసరాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. దశాబ్దాలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా జెట్టీకి వెళ్లే మార్గంలో గ్రావెల్ రోడ్డును నిర్మించి వారి రవాణా కష్టాలను తీర్చారు. అంతేకాకుండా సముద్ర కోత వల్ల ఇళ్లను కోల్పోయిన మాయాపట్నం మత్స్యకారులకు సుబ్బంపేట సమీపంలో కల్పించిన కొత్త మాయాపట్నం పునరావాస కాలనీలో 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రూ. 1.52 కోట్లతో 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.కొత్తసూరాడపేట పునరావాస కాలనీకి సైతం రూ. 93 లక్షలతో 1.6 కిలోమీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించి, ప్రధాన రహదారికి అనుసంధానం చేశారు. తుపాన్ల ధాటికి పూర్తిగా కొట్టుకుపోయిన యు.కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి–రామన్నపాలెం బీచ్ రోడ్డును రూ. 88 లక్షలతో పునర్నిర్మించడం ద్వారా వేలాది మంది ప్రజలకు, స్థానిక బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గం సుగమమైంది.సెజ్ పరిధిలో ఉండి ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరమైన ముమ్మడివారిపాడు గ్రామానికి రూ. 79.70 లక్షలతో శాశ్వత రహదారిని అందుబాటులోకి తెచ్చారు. కొత్తపల్లి గ్రామంలో ప్రజల చిరకాల కోరికైన శ్మశాన వాటిక దారిని రూ. 26.30 లక్షలతో సీసీ రోడ్డుగా మలిచారు. కొండెవరం గ్రామ పరిధిలోని పిఠాపురం–ఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డును రూ. 1.22 కోట్ల ఉపాధి నిధులతో పవన్ కళ్యాణ్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. మరోవైపు దశాబ్దాలుగా గుంతలమయమై నరకప్రాయంగా మారిన గొల్లప్రోలు మండలం వెన్నెపూడి జీఎస్టీ ప్రధాన రహదారిని రూ. 85 లక్షలతో, గొల్లప్రోలు–తాటిపర్తి పుంత రోడ్డును రూ. 1.46 కోట్లతో పునర్నిర్మించి రైతులకు, ప్రయాణికులకు ఊరటనిచ్చారు. చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీ వాసుల కోసం రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భద్రతకై రూ. 50 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు.వ్యవసాయ రంగ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 'పల్లెపండుగ 2.0' ద్వారా పంట పొలాల మధ్య ఉన్న డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పి.రాయవరం, బి. ప్రత్తిపాడు గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి 3 కిలోమీటర్ల మేర నిర్మించిన గ్రావెల్ రోడ్లు దాదాపు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు మెరుగైన రవాణా సదుపాయాన్ని కల్పించాయి. అభివృద్ధి పనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న 70 కిలోమీటర్ల పెండింగ్ రోడ్డు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు

# రైతుల పంట విరామం

ఏలూరు, ఆగస్టు 10, ఆరుగాలం శ్రమించిన పంట చేతికి అందుతుందన్న దశలో ప్రకృతి వైపరీత్యాల బారినపడి ఖరీఫ్ పంట నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికంతటికి మురుగు కాలువల ఆక్రమణ, విచ్చలవిడిగా ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లోనూ వదులుతుండటం కారణమని రైతులు వాపోతున్నారు. జూలై నెలాఖరు వరకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇలా అనేక కారణాలు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నాయని, ఈ క్రమంలోనే సాగు చేయలేమంటూ రైతులు విరమణ ప్రకటించారు

అల్లవరం మండలం తాడికోన గ్రామంలో వరి రైతులు. ఊడ్పుని చేలు వద్ద పంట విరామం ప్రకటిస్తున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో చర్చకు దారితీసింది. ఈ క్రమంలోనే తాడికోన గ్రామంలో ఎవ్వరు ఊడ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. డ్రైయిన్ల ఆక్రమణపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం స్పందించడం లేదని అన్నారు. దీంతో చిన్నపాటి వర్షాలకి పంట పొలాలు ముంపు గురై పంట నాశనం అవుతుందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడులు దక్కక అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క విచ్చలవిడిగా ఆక్వా చెరువులు తవ్వి అక్రమ సాగు చేస్తున్న తీరుపై ఫిర్యాదులు చేస్తున్న కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ రైతులు మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో పంట విరామం ప్రకటిస్తున్నట్లు తాడికోన రైతులు వెల్లడించారు.అల్లవరం మండలం బెండమూర్లంకలో చారిత్రాత్మకమైన మొదటి పంట విరామ ఉద్యమం 2011లో రైతులు ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడం, పెట్టుబడి వ్యయం పెరిగిపోవడం, డ్రెయినేజీ సమస్యల వల్ల బెండమూర్లంక రైతులు తొలిసారిగా ఈ వినూత్న ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమ ప్రభావం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మోహన్ కందా కమిటీ వేసి క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులపై విచారణ చేపట్టించారు. ఇదే తరహాలో కాలువల ఆధునికీకరణ, ధాన్యం బకాయిల ఆలస్యంపై నిరసనగా మళ్లీ 2022 ఖరీఫ్ సీజన్‌లో బెండమూర్లంకతోపాటు అల్లవరం మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు పంట విరామం ప్రకటించారు.

మళ్ళీ ఇప్పుడు ఇదే మండలంలోని తాడికోన గ్రామం నుంచి పంట విరామం ఉద్యమం ప్రారంభించారు.

# 100 శాతం టెలికాం కనెక్టివిటీ

విజయవాడ, ఆగస్టు 10, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కమ్యూనికేషన్ రంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ప్రతీ మారుమూల గ్రామానికి, గిరిజన ప్రాంతాలకు సైతం నెట్‌వర్క్ సౌకర్యాన్ని చేర్చడం ద్వారా 100 శాతం టెలికాం కనెక్టివిటీని సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా టెలికాం ఆపరేటర్లను మరియు టవర్ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఎన్నడూ లేని విధంగా భారీ రాయితీలను, సరికొత్త రాయితీ విధానాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చింది.ఈ మెగా ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు మొబైల్ టవర్ల ఏర్పాటుకు ఎలాంటి అద్దె లేకుండా ఉచితంగా ప్రభుత్వ భూములను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనితో పాటు సదరు టెలికాం టవర్లకు అత్యంత తక్కువ ధరకే రాయితీపై విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించింది. టెలికాం ఆపరేటర్ల నుండి వచ్చే ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు వేగంగా పరిశీలించి, ఎక్కడా జాప్యం లేకుండా టవర్ల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూములను తక్షణమే గుర్తించి కేటాయించాల్సిందిగా వివిధ శాఖల ప్రభుత్వ కార్యదర్శులను ఐటీ శాఖ కోరింది. అలాగే క్షేత్రస్థాయిలో ఈ భూముల కేటాయింపు ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకంగా సహకరించాలని రాష్ట్ర ఐటీ రక్షణ శాఖ స్పష్టం చేసింది. డిజిటల్ ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల రాష్ట్రంలో ఇంటర్నెట్, మొబైల్ సిగ్నల్స్ లేని ప్రాంతమంటూ లేకుండా పోతుందని, దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరియు డిజిటల్ సేవలు మరింత విస్తరిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

# ఉలవపాడులో పునాస మామిడికి డిమాండ్

ఒంగోలు, ఆగస్టు 10, ఏపీలో ఉలవపాడు మామిడి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో దొరికే పునాస రకం మామిడితో భారీ లాభాలు అందుకుంటున్నారు. ఈసారి కేజీ కాయలు రూ.50 వరకు పలుకుతున్నాయి.. దీంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ నెలలో ఓనం పండగ కూడా ఉండటంతో మామిడి కాయలకు ఇంకా మంచి ధర వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది కాస్త లాభాలు వస్తాయని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా ఉలవపాడు మామిడి కాయలు బాగా ఫేమస్. బంగినపల్లి, రసాలు సహా పలు రకాల మామిడి కాయలు సీజన్‌లో దొరుకుతాయి. మార్చి నెలలో సీజన్ మొదలైతే.. జూన్ వరకు కొనసాగుతుంది. ప్రతి ఏటా సీజన్ ముగిశాక కూడా మామిడి రైతులు పునాస రకం కాయల ద్వారా ఆదాయం పొందుతున్నారు. కొన్నేళ్లుగా పునాస కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మాత్రం అలా కాదు.. పునాస కాయల ధరలు దుమ్ము రేపుతున్నాయి.. భారీగా లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.ప్రకాశం జిల్లా గుడ్లూరు, ఉలవపాడు మండలాలు సహా అన్ని చోట్లా కలిపి పునాస మామిడిని ఐదువేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, రసాలు, బెంగళూరు రకం కాయల సీజన్ తర్వాత.. జులై, ఆగస్టు నెలల్లో పునాస పంట చేతికి వస్తుంది. నాలుగైదు రోజులుగా ఈ పునాస రకం మామిడి కాయలకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. కేజీ రూ.50 వరకు పలుకుతోంది.. టన్ను రూ.50వేల వరకు ఉంది. గుడ్లూరు మండలంలో ప్రతి రోజూ నాలుగు టన్నులు వరకు కాయలు చెన్నై, బెంగళూరు సహా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉలవపాడుకు ఈ కాయల్ని తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా పంపిస్తున్నారు.ఈ పునాస మామిడి కాయలు కేరళంలో నిర్వహించే ఓనం పండగకు వినియోగిస్తుంటారు. అందుకే కేరళం రాష్ట్రానికి ఎగుమతులు ఎక్కువగా పునాస కాయల్ని ఎగుమతి చేస్తుంటారు. ఆగస్టు నెలాఖరులో ఈ పండగ ఉండటంతో.. కాయల ధర మరింత పెరిగే అవకాశం ఉందని, లాభాలు వస్తాయని రైతులు ఆనందంలో ఉన్నారు.

# జనాలు ఓట్లు రాలుస్తాయా.....

విజయవాడ, ఆగస్టు 10, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పర్యటనలు ఎప్పుడూ రాజకీయంగా చర్చనీయాంశంగానే మారుతుంటాయి. ఆయన ఎక్కడికి వెళ్లినా పెద్ద ఎత్తున ప్రజలు కనిపించడం సహజమే. గతంలో పార్టీ నాయకులు ప్రత్యేకంగా జనసమీకరణ చేపట్టేవారనే విమర్శలు వినిపించేవి. అయితే ఇప్పుడు పరిస్థితి మారిందని వైసీపీ నాయకులు చెబుతున్నారు. జగన్ పర్యటనలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, ఎవరినీ ప్రత్యేకంగా తీసుకురావాల్సిన అవసరం లేదని వారు వాదిస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళం తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగిన పర్యటనల్లో కనిపించిన జనసందోహాన్ని ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు.అయితే ఈ పరిస్థితిని మరో కోణంలో కూడా రాజకీయ విశ్లేషకులు పరిశీలిస్తున్నారు. పెద్ద ఎత్తున జనాలు రావడం రాజకీయంగా బలం చూపించినా, భద్రతా పరంగా మాత్రం సవాళ్లు పెంచుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. భారీగా ప్రజలు చేరడం వల్ల తొక్కిసలాటలు, ఆస్తి నష్టం లేదా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాంటి సంఘటనలు భవిష్యత్తులో రాజకీయంగానే కాకుండా చట్టపరంగానూ ఇబ్బందులు తీసుకురావచ్చని అంచనా వేస్తున్నారు.ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పర్యటన సందర్భంగా ఒక మహిళకు చెందిన దుకాణం దెబ్బతినడం, పొగాకు బేళ్లపై కొందరు ఎక్కి తొక్కడం వంటి ఘటనలు చర్చకు వచ్చాయి. అలాగే శ్రీకాకుళం జిల్లాలో మహిళా ఎస్పై విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన తోపులాట కూడా వివాదాస్పదమైంది. ఈ సంఘటనలకు సంబంధించిన వీడియోలు, వివరాలను అధికార వర్గాలు ప్రత్యర్థి పార్టీ నాయకులు నమోదు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.గతంలో గుంటూరు జిల్లాలో జరిగిన మరో ఘటన కూడా తరచూ ప్రస్తావనకు వస్తోంది. ఒక పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళ్లిన సమయంలో జరిగిన రద్దీలో మరో కార్యకర్త వాహనం కింద పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు రాజకీయ కార్యక్రమాల్లో భద్రత ఎంత ముఖ్యమో గుర్తు చేస్తున్నాయి.ఇదే తరహా ఘటనలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా చోటుచేసుకున్నాయి. తమిళనాడులో విజయ్ నిర్వహించిన భారీ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. అలాగే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలో కూడా భారీ జనసందోహం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. బీహార్ లో ప్రశాంత్ కిశోర్ పాదయాత్ర సందర్భంగా భద్రతా సమస్యలు వెలుగులోకి వచ్చాయి.ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ సభలు, ర్యాలీలు, పాదయాత్రల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలపై ప్రభుత్వం, పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశముంది. భవిష్యత్తులో జగన్ చేపట్టే పాదయాత్ర లేదా ఇతర భారీ కార్యక్రమాలకు అనుమతులు, భద్రతా నిబంధనల విషయంలో మరింత కఠినమైన షరతులు విధించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ బలం చూపించడమే కాకుండా ప్రజల భద్రతను కాపాడటం కూడా అన్ని పార్టీల ప్రధాన బాధ్యత అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జైలు కెళ్తే టిక్కెట్ గ్యారంటీ

వైసీపీలో ఇపుడు కొత్త చర్చ సాగుతోంది. పార్టీ కోసం జనంలో ఉండి పోరాడామని ఎవరు చెప్పినా దానికి అధికారిక పత్రం ఏమి ఉంటుంది అన్నదే అంతా అనుకుంటారు. అదే ఏదో విధంగా జనంలోకి వచ్చి పోరాటాలు చేస్తే ఆ మీదట ఎటూ పోలీసులు కేసు కడతారు, అలా అరెస్టు అయి జైలు పాలు అయితే అది నేరుగా అధినాయకత్వం దృష్టిలోకి వెళ్తుందని తప్పకుండా అలాంటి వారికే టికెట్ దక్కుతుందని అంటున్నారు. వైసీపీలో ఈ అరెస్టులు జైళ్ళు ఇలా ఎంతో మంది నాయకులు గత రెండేళ్ళుగా ఎదుర్కొంటూ వచ్చారు, ఇపుడు మరింత మంది జైలులో ఉన్నారు, ఇంకొంతమంది జైలుకు వెళ్ళే బాటలో ఉన్నారని అంటున్నారు. వైసీపీ నేతలు ఎవరైనా అరెస్టు అయితే ఆ పార్టీ అధినాయకత్వం నుంచి భారీ రియాక్షన్ వస్తోంది. నేరుగా జగన్ ట్వీట్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మీద విమర్శలు కూడా అందులో చేస్తున్నారు. అంతే కాదు వారికి పరామర్శలు ఆ మీదట భారీ ప్రచారం వంటివి వెంటవెంటనే జరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో చూసుకుంటే శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు అరెస్టు అయితే జగన్ పరామర్శకు జైలు దాకా వెళ్ళి వచ్చారు. ఆ తరువాత కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే విరూపాక్షని అరెస్టు చేశారు. ఇపుడు శ్రీకాకుళంలో ఆముదాలవలస ఇంచార్జి చింతాడ రవి కుమార్ ని అరెస్టు చేశారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఆయనకు సంఘీభావం ప్రకటించారు. అధినాయకత్వం కూడా దీని మీద ఘాటుగా స్పందించింది. ఆముదాలవలస అంటే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందరికీ గుర్తుకు వస్తారు. అలాంటి చోట 2024 ఎన్నికల తరువాత వైసీపీ అధినాయకత్వం చేసిన మార్పులలో భాగంగా యువ నేత అయిన చింతాడ రవికుమార్ కి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన నాటి నుంచి పార్టీని యాక్టివ్ గా చేస్తున్నారు. జగన్ తాజా శ్రీకాకుళం పర్యటనలో ఆయన భారీ జనాలతో తరలి వచ్చారు. ఈ సందర్భంగానే మహిళా ఎస్పైతో జరిగిన గొడవలో ఆయనను అరెస్టు చేశారు. ఇక ఇపుడు ఆయనకు ఆముదలవలస టికెట్ ఖరారు అయినట్లే అని అంటున్నారు. మరో వైపు భూ కబ్జా ఆరోపణల మీద మాజీ స్పీకర్ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. దాంతో కూడా చింతాడ రవి కుమార్ కి కలసి వచ్చింది అని అంటున్నారు.

# రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు

విశాఖపట్టణం, ఆగస్టు 10, కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. ప్రస్తుత జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ నెలాఖరు నాటికి ప్రస్తుత జిల్లాపరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో పదవీకాలం పూర్తి అయిన తర్వాత కొత్త జిల్లాపరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త జిల్లా పరిషత్‌ల ఏర్పాటుపై రాష్టంలోని అన్ని జిల్లా పరిషత్ సీఈవోలతో ప్రభుత్వం సమావేశం కానుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే, రాబోయే నెలల్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత, 2022 ఏప్రిల్‌లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే, పరిపాలనాపరమైన ఇబ్బందులను నివారించడానికి, అప్పటికే ఎన్నికైన జిల్లా పరిషత్ మండళ్లు.. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన తమ కార్యకలాపాలను కొనసాగించాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరవుతున్నారు.మరోవైపు కొత్త జిల్లాల కోసం ప్రత్యేక జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసి, వాటికి ప్రత్యేక కార్యాలయ భవనాలను సమకూర్చాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచిస్తోంది. విశాఖపట్నం జిల్లా పరిషత్ మూడు జిల్లా పరిషత్‌లుగా.. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజుగా విభజించనున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయం మాత్రం ప్రస్తుతం ఉన్న భవనం నుంచే తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది.విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో సుమారు 60 శాతం మందిని 24 మండలాలు కలిగిన అనకాపల్లి జిల్లాకు, 30 శాతం మందిని 11 మండలాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన 10 శాతం మందిని కేవలం నాలుగు మండలాలు మాత్రమే ఉన్న విశాఖపట్నం జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల యంత్రాంగాలు ఇప్పటికే కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాల కోసం తగిన భవనాలను, స్థలాలను గుర్తించాయి.

లోకల్ బాడీ ఎన్నికల తర్వాత కేబినెట్

మంత్రులు మౌనంగా ఉంటే సహించేది లేదని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. ముఖ్యంగా టీడీపీ మంత్రులకు ఆయన ఈ విషయంలో ఇప్పటికే చాలా సార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చాలా మంది మంత్రులు మౌనంగా ఉండడం.. కనీసం పన్నెత్తు విమర్శ కూడా చేయకపోవడంతో సీఎం మరోసారి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయమే టెలీ కాన్ఫరెన్సు నిర్వహించిన సీఎం చంద్రబాబు.. మంత్రులకు వారి బాధ్యతలను గుర్తు చేసినట్టు తెలిసింది.ఫైళ్ల క్లియరెన్సు, శాఖలపై పట్టు విషయంలో రెండున్నరేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఐదుగురు టీడీపీ మంత్రులు పట్టు పెంచుకోలేక పోయారని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఇక, ప్రత్యర్థులు చేస్తున్న దాడిని ఎదుర్కొనడంలో దాదాపు సగం మంది మౌనంగానే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంకా.. ప్రతి విషయాన్నీ తాను చెప్పాలంటే కుదరదని.. ఇక నుంచి అయినా.. మిషన్ మోడ్‌తో పనిచేయాలని సూచించారు. ప్రత్యర్థులు రెచ్చిపోతున్నా.. మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు.ఇక, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రులకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఒక్క చోట కూడా.. కూటమి పార్టీలు ఓటమి చవి చూడకూడదని స్పష్టం చేశారు. ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అదే సమయంలో మీడియా ముందుకు రావడం.. ప్రజలకు మంచిని వివరించడం చేయాలని చెప్పారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా.. దాని తాలూకు ఫలితం ఓట్ల రూపంలో మారకపోతే.. ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు.తానే స్వయంగా మంత్రుల పనితీరును పరిశీలించనున్నట్టు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జిల్లాల ఇంచార్జ్ మంత్రులు.. అసలు జిల్లాల్లో పర్యటించడం లేదని తనకు నివేదికలు అందాయన్నారు. ముఖ్యంగా అంతర్గత పోరును తగ్గించాలని చెబుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇది సరికాదన్న ఆయన 'పనితీరు మెరుగు పరుచుకోని వారు.. ఆలోచన చేసుకోవాలి" అని పరోక్షంగా హెచ్చరించారు. వచ్చే స్థానిక ఎన్నికల తర్వాత.. ఫలితాన్ని బట్టి మార్పులు ఉండే అవకాశం ఉందని ఆయన పరోక్షంగా మంత్రి వర్గ ప్రక్షాళనపై సంకేతాలు ఇచ్చేశారు.

# జనసేన పవర్ ఫుల్ ప్లాన్

విజయవాడ, ఆగస్టు 10, జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైలెంట్ గా తన పని తాను చేసుకుని పోతున్నారు. ఒక వైపు పార్టీ అధినేతగా జనసేనను సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యక్రమాలు చేస్తున్నారు. మరో వైపు ఉప ముఖ్యమంత్రిగా తన దగ్గర ఉన్న ప్రాధాన్యత కలిగిన శాఖలను పూర్తిగా అవగాహన చేసుకుని వాటి పనితీరులో మెరుగుదల చూపిస్తున్నారు. అటవీ శాఖ ద్వారా గిరిజన ప్రాంతాలలో రోడ్లు వేయించి అడవి తల్లి బాట పేరుతో వారికి దారి చూపిస్తున్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. పనిలో పనిగా పర్యావరణ శాఖ మీద కూడా ఆయన దృష్టి పెట్టారు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అయిన పంచదార్ల వద్ద అక్రమ మైనింగ్ జరుగుతోందని తెలిసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నో మైనింగ్ జోన్ గా ప్రకటించాలని కూడా సూచించారు.ఇక పార్టీ పరంగా చూస్తే పవన్ కళ్యాణ్ బూత్ లెవెల్ నుంచి జనసేనను పటిష్టం చేసే కార్యక్రమం ముమ్మరం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికే పెద్ద పీట వేస్తున్నారు. అంతే కాక వారు జనసేనలో ఏళ్ళ తరబడి పనిచేసేలా ఉండడమే అర్హతగా చూసుకుంటున్నారు. రేపు జరిగే స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎత్తిన వారికే సీట్లు అన్న విధానం కూడా తీసుకుని రావాలని చూస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ విధంగా జనసేనను నమ్ముకుంటే తమకు న్యాయం జరిగింది అన్నది పార్టీ క్యాడర్ అంతా అనుకుని సుదీర్ఘ కాలం పాటు గట్టిగా నిలబడేలా జనసేన అధినాయకత్వం పక్కాగా ప్రణాళికలను రచిస్తోంది అని అంటున్నారు. ఇక దైనందిన విషయాల్లో ప్రత్యర్థుల మీద విమర్శలు ఉంటూ ఉంటాయి. వైసీపీ మీద ప్రతీ రోజూ విమర్శలు చేసే విధానానికి జనసేన దూరంగా ఉంటోంది. అందుకే ఆ పార్టీ తన లక్ష్యాలను ఏమిటో నిర్దేశించుకుని వాటికి అనుగుణంగా ముందుకు సాగుతోంది అని అంటున్నారు. వారిని వీరు వీరిని వారు విమర్శించుకోవడం వల్ల ఉపయోగం లేదని మీడియాలో హైప్ క్రియేట్ కావడం తప్ప గ్రౌండ్ లెవెల్ లో ఏమీ ఉండదని జనసేన భావిస్తోంది. అందుకే జనసేన ఈ తరహా విమర్శల రాజకీయానికి దూరంగా ఉంటోంది అని అంటున్నారు. ఇక జనసేన 2029 ఎన్నికల మీదనే తన చూపు నిలిపింది అని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు పొత్తులో భాగంగా కోరాలీ అంటే ముందు పార్టీగా బలపడాల్సిన అవసరం ఉందని జనసేన నమ్ముతోంది. పార్టీకి బూత్ లెవెల్ నుంచి క్యాడర్ అలాగే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలతో పాటు నియోజకవర్గాన్ని నడిపించే బలమైన నాయకత్వం ఉంటే కచ్చితంగా ఎక్కువ సీట్లు తీసుకోవచ్చు అని భావిస్తోంది. వచ్చే ఎన్నికలు జనసేనకు ఒక విధంగా కీలకం అని అంటున్నారు. ఎక్కువ సీట్లు తీసుకుని 2024 మాదిరిగానే సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ తో గెలిస్తే కచ్చితంగా ఆ తరువాత ఏర్పడే ప్రభుత్వంలో ముఖ్యమైన పాత్ర పోషించేందుకు వీలు ఉంటుందని కూడా ఆలోచిస్తోంది అని అంటున్నారు. మొత్తానికి జనసేన దీర్ఘ కాలం ఆలోచనలు చేస్తోంది. అందుకే సైలెంట్ గానే పవన్ తన పని ఏంటో చేసుకుని పోతున్నారు అని అంటున్నారు.

## ఆలీ రాజకీయాలు ఎందుకు వదిలేశాడు?

గుంటూరు, ఆగస్టు 10, తెలుగు సినిమా నటులు రాజకీయాలు చేయడం ఎప్పట్నుంచో ఉన్నదే. కానీ ఈ మధ్య పరిస్థితులు మారిపోయాయి. సినిమాలు వేరు, రాజకీయాలు వేరు అని చూడట్లేదు జనం. సినిమా వాళ్లు రాజకీయాల్లోకి వస్తే.. ఆ ప్రభావం వారి సినిమాల మీదా పడుతోంది. ఇలా కెరీర్‌ను దెబ్బ తీసుకున్న వాళ్లలో ఆలీ కూడా ఒకరు. ఆయన చాలా ఏళ్ల పాటు తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. తర్వాత తన మిత్రుడు పవన్ కళ్యాణ్ పెట్టిన జనసేనలోకి వస్తారని అనుకుంటే.. అనూహ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. వైసీపీ గెలిచాక ఒక పదవిలో ఉన్న ఆయన.. ఆ పార్టీ ఓడిపోయాక రాజకీయాల నుంచి వైదొలిగారు. ఇకపై మళ్లీ రాజకీయాల్లోకి వచ్చేదే లేదంటున్నారు. మరి రాజకీయా పట్ల ఎందుకు విముఖత పెంచుకున్నారు అని ఒక ఇంటర్వ్యూలో అడిగితే.. ఆలీ సమాధానం చెప్పారు. తాను మొదట పనిచేసిన పార్టీ పట్ల తన అసంతృప్తిని బయటపెట్టుకున్నారు. రాజకీయాల వల్ల సినిమా కెరీర్ దెబ్బ తిన్న విషయాన్ని అంగీకరించారు. 'నేనెప్పుడూ రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదు. 1999లో ఒక పార్టీ వాళ్లు నన్ను తీసుకెళ్లి ఆ పార్టీ కండువా కప్పారు. దాదాపు 20 ఏళ్ల పాటు ఆ పార్టీలో ఉన్నాను. ఐతే నాకు ఎలాంటి గుర్తింపు లభించలేదు. కేవలం ఐదేళ్లకోసారి ఎన్నికలు వచ్చినపుడు నన్ను ఉపయోగించుకోవడం, తర్వాత వదిలేయడం.. ఇదే జరిగింది. మనల్ని వాళ్లు గుర్తించనపుడు, మనల్ని అవసరానికి వాడుకుని వదిలేస్తున్నపుడు మన సమయాన్ని వాళ్ల కోసం ఎందుకు వేస్ట్ చేయడం అనిపించింది. సినిమాలను పక్కన పెట్టి, టైం పెట్టి ఇలా కష్టపడడం ఎందుకు అనిపించింది. అందుకే ఆ పార్టీ నుంచి పక్కకు వచ్చేశాను. తర్వాత ఇంకో పార్టీలోకి వెళ్లాను. అక్కడా పని చేశాను. మళ్లీ అది కూడా వద్దనిపించింది. మనకు తిండి పెట్టింది, ఇంతవాడిని చేసింది సినిమా. రాజకీయాల కోసం సినిమాలను ఎందుకు వదులుకోవాలి. ఈ కెరీర్‌ను ఎందుకు దెబ్బ తీసుకోవాలి అనిపించింది. అందుకే రాజకీయాల నుంచి పూర్తిగా బయటికి వచ్చేశాను. ఇకపై మళ్లీ ఆ రంగంలోకి వెళ్లను" అని ఆలీ తేల్చి చెప్పాడు.

రఫ్ఫా..రఫ్ఫా మిస్సింగ్

వైసీపీ అధినేత జగన్ పర్యటనల్లో భాగంగా ఇటీవల కాలంలో 'రప్పా-రప్పా' డైలాగులు తరచుగా వినిపించేవి. రప్పా-రప్పా అని రాసున్న బ్యానర్లు, ప్లకార్డులు కూడా దర్శనమిచ్చాయి. అయితే.. ఇవి సమాజాన్ని రెచ్చగొట్టేలా ఉండడం.. రౌడీయిజాన్ని పెంచేలా ఉండడంతో పోలీసులు ఈ వ్యాఖ్యలు సహా.. ఈ బ్యానర్లను కట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. దీంతో ఇటీవలి జగన్ పర్యటనల్లో రప్పా-రప్పా బ్యానర్లు మాయమయ్యాయి. వీటి స్థానంలో కొత్తవి చోటు చేసుకున్నాయి.ఇటీవల వైసీపీ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు జగన్ శ్రీకాకుళం వెళ్లారు. ఈ సమయంలో కూడా రప్పా-రప్పా బ్యానర్లు కనిపించలేదు. యువత కూడా.. రప్పా-రప్పా అని రాసున్న ప్లకార్డులను ప్రదర్శించలేదు. ఇక, తాజాగా బుధవారం మాజీ సీఎం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పర్యటించారు. పొగాకు రైతులకు మద్దతు ధరలు రావడం లేదని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ.. రైతులను పరామర్శించేందుకు తాడేపల్లి నుంచి ఆయన దేవరపల్లికి చేరుకున్నారు.ఈ సమయంలో భారీగా కార్యకర్తలు, మహిళలు జగన్ పర్యటనకు వచ్చారు. ఈ సమయంలో రప్పా-రప్పా బ్యానర్ల స్థానంలో వినూత్నంగా బ్యానర్లు కనిపించాయి. "నువ్వే మా రారాజు. నువ్వే మా దేవుడు. నీతోనే మేం నడుస్తాం." అని రాసున్న ప్లకార్డులను పలువురు మహిళలు, యువత కూడా ప్రదర్శించారు. మరోవైపు.. పోలీసులు గట్టి భద్రతను కల్పించారు. తొలుత అనుమతి లేదని చెప్పినా.. చివరి నిమిషంలో అనుమతి ఇచ్చారు. నేరుగా దేవరపల్లికి హెలికాప్టర్‌లో వెళ్లిన జగన్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు.ఈ సమయంలో పెద్ద ఎత్తున చేరుకున్న కార్యకర్తలు.. జగన్ దేవుడంటూ.. కొనియాడారు. ఆయన పాలన తిరిగి వస్తుందని రాసి ఉన్న బ్యానర్లు పట్టుకుని కనిపించారు. అయితే.. మరోవైపు రప్పా-రప్పా అని రాసి ఉన్న ప్లకార్డులు కానీ, బ్యానర్లు కానీ కనిపిస్తాయేమోనని పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ బ్యానర్లు, ప్లకార్డులు కనిపిస్తే.. సదరు వ్యక్తులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక టీంను రంగంలోకి దింపారు. కానీ .. పోలీసుల ఎఫెక్ట్‌తో రప్పా-రప్పా బ్యానర్లు కనిపించకపోవడం గమనార్హం.

# మళ్లీ జలజగడం...

హైదరాబాద్, ఆగస్టు 10, తెలంగాణలో ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే సెంటిమెంట్ రగులుతోంది. ప్రధానంగా "నీటి సెంటిమెంట్" తో ప్రతిపక్ష బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తుంది. తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఏపీకి తరలిస్తున్నారని, గోదావరి, కృష్ణా నదీ జలాలపై రగడ మొదలయింది. తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్ కు తాకట్టు పెడుతున్నారంటూ గులాబీ పార్టీ కాంగ్రెస్ పై మండి పడుతుంది. తన గురువు చంద్రబాబు కోసం గోదావరి, కృష్ణా నీటిని తెలంగాణకు దక్కకుండా ఏపీకి తరలించుకు పోతున్నా మౌనంగా ఉంటున్నారని ఆరోపణలను గుప్పిస్తుంది. దీనికి కాంగ్రెస్ పార్టీ ఘాటుగా కౌంటర్ ఇస్తుంది.తెలంగాణ చరిత్ర తెలంగాణ రాజకీయాల్లో 'నీళ్లు' అనేది కేవలం వనరు మాత్రమే కాదు, ఉద్యమ పునాది నుంచి బలమైన భావోద్వేగ సెంటిమెంట్. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో "నీళ్లు, నిధులు, నియామకాలు" నినాదంలో నీళ్లే ప్రథమ స్థానంలో నిలిచాయి. సమైక్య రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ రాజకీయ పార్టీలు ఎప్పుడూ ప్రజలను ఏకం చేస్తుంటాయి. తెలంగాణ ఉద్యమం వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాలు. సెంటిమెంట్ మానంగా దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలు పాలకుల నిర్లక్ష్యంతో సీమాంధ్రకు తరలిపోయాయనే ఆవేదన తెలంగాణ సమాజంలో ఉండేది. తాగు, సాగునీరు అందక ఎండిన భూములు, వలసల నేపథ్యమే తెలంగాణ రాజకీయ అస్తిత్వానికి ప్రధాన ప్రాతిపదికగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా నీటి హక్కుల రక్షణే ప్రధాన అజెండాగా సాగుతోంది. గోదావరి, కృష్ణా నదీ జలాల కేటాయింపులు, బోర్డుల సమావేశాల అజెండాలు రాష్ట్రంలో తరచూ తీవ్ర రాజకీయ రగడకు దారితీస్తున్నాయి.పక్క రాష్ట్రాల ప్రాజెక్టుల విస్తరణ లేదా కొత్త ప్రతిపాదనలు పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమదే నీటి హక్కుల పరిరక్షణ అంటుంటే, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల ప్రారంభాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక శక్తిగా ఉంటాయి.నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందనే చిన్న సంకేతం కూడా తెలంగాణలో వెంటనే బలమైన రాజకీయ వ్యతిరేకతను, సెంటిమెంట్‌ను రగిలిస్తుంది. మరి ఈ సెంటిమెంట్ ఎప్పటి వరకూ కొనసాగిస్తారో.. ఎవరు అధిగమించి అధికారాన్ని చేపడతారో చూడాల్సి ఉంది.

## బోనాల ఉత్సవాల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ హిందూ సమాజమంటేనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు భయం. మైనారిటీ సంతూష్టీకరణ విధానాలనే ఆ పార్టీలు అవలంబిస్తున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. బీజేపీ మైనారిటీ సంతూష్టీకరణ విధానాలకు పూర్తి వ్యతిరేకం. తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను ఎందుకు పాఠ్యాంశాల్లో చేర్చలేదు. టిప్పు సుల్తాన్ దీపావళి నాడు ఆలయంలో వెయ్యి మంది మహిళలను, పిల్లలను కాల్చి చంపిన నీచుడు. అట్లాంటి దుర్మార్గుడిని హీరో చిత్రీకరిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆయన విగ్రహాలు పెట్టడం కరెక్టేనా? అయోధ్య రామాలయ నిర్మాణాన్ని కాంగ్రెస్ నేతలు ఎందుకు వ్యతిరేకించారని ప్రశ్నించారు.వాస్తవాలు చెబితే కాంగ్రెస్ కు కడుపు మంటగా ఉంది. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారు సరే... నిధులేవి? హైదరాబాద్ లో 3, 400 ఆలయాలుంటే బోనాల ఉత్సవాలకు రూ.20 కోట్లు విదిలిస్తారా? రంజాన్ పండుగకు మాత్రం రూ.33 కోట్లు విడుదల చేస్తారా? బోనాల ఉత్సవాల్లో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వాస్తవాలు ప్రస్తావిస్తే మతం పేరుతో చిచ్చు పెట్టాలని మాట్లాడతారా? రంజాన్ పండుగకు రూ.33 కోట్లు ఇస్తే...80 శాతం మంది హిందువుల పండుగకు ఇంకెన్ని కోట్లు ఇవ్వాలి. విదేశాలు నిషేధించిన తబ్లీగ్ జమాతే సంస్థ సభకు కూడా కాంగ్రెస్ రూ.2.40 కోట్లు విడుదల చేస్తారా? నేను హిందువుల కోసం బరాబర్ ప్రశ్నిస్తా ..గోమాతను వధిస్తే ప్రశ్నించాలా? వద్దా? హిందూ ఆలయాలను ధ్వంసం చేస్తే ప్రశ్నించాలా? వద్దా? 15 నిమిషాల టైమిస్తే హిందువులను నరికి చంపుతానంటే ప్రశ్నించవద్దా? నేను బరాబర్ సనాతన ధర్మం కోసం పని చేస్తా హిందువులంతా జాగ్రుతం కావాలని అన్నారు.

## 12 వేల 500 కోట్ల కలెక్షన్స్ తో స్పైడర్ మ్యాన్

ముంబై, ఆగస్టు 10, (న్యూస్ పల్స్) హాలీవుడ్ సూపర్ హీరో మూవీ 'స్పైడర్ మ్యాన్ : బ్రాండ్ న్యూ డే' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా వీక్ డేస్‌లోనే సరికొత్త రికార్డులు సృష్టించింది. ఇప్పటివరకూ వరల్డ్ వైడ్‌గా వి1.31 బిలియన్ డాలర్లకు (ఇండియన్ కరెన్సీలో రూ.12,300 కోట్లకు పైగా కలెక్షన్స్) పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. ఇండియాలో ఇప్పటివరకూ రూ.400 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ మూవీ ఓటీటీపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది.థియేట్రికల్ రన్ తర్వాత స్పైడర్ మ్యాన్ లేటెస్ట్ మూవీ ఇంటర్నేషనల్ ఓటీటీ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లిష్‌తో పాటు తెలుగు సహా ఇతర భాషల్లోనూ అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. సెప్టెంబర్ లాస్ట్ వీక్ లేదా అక్టోబర్ సెకండ్ వీక్‌లో ఓటీటీలో స్ట్రీమ్ అయ్యే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం 'స్పైడర్ మ్యాన్ : నో వే హోమ్' జియో హాట్ స్టార్‌లో అందుబాటులో ఉంది. లేటెస్ట్ మూవీ ఈ ఓటీటీలోనూ వచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది.ఈ మూవీకి డెస్టిన్ డేనియల్ క్రెట్టన్ దర్శకత్వం వహించగా... టామ్ హాలండ్ స్పైడర్ మ్యాన్‌గా నటించాడు. అతనికి జోడీగా జెండయా నటించారు. జాకబ్ బాటలన్, సాడీ సింక్, జాన్ బెర్నాల్, మార్క్ రుఫలో, మైఖేల్ మాండో తదితరులు కీలకపాత్రలు పోషించారు. సోనీ పిక్చర్స్ ఎంటర్టైన్మెంట్స్ ఇండియా బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మించారు.పీటర్ పార్కర్ (టామ్ హాలండ్) ఎవరనేది ప్రపంచం మర్చిపోవడంతో స్నేహితులు, ప్రియురాలు అందరికీ దూరంగా ఉంటూ ఒంటరి జీవితాన్ని గడుపుతుంటాడు. న్యూయార్క్‌లో జరగబోయే నేరాలను తన ట్రాకింగ్ సిస్టమ్‌తో ముందే పసిగట్టి వాటిని అడ్డుకుంటూ నేరస్థులను చట్టానికి అప్పగిస్తూ... ఓ ఫ్రెండ్లీ స్పైడర్ మ్యాన్‌గా వ్యవహరిస్తుంటాడు. సరిగ్గా అదే టైంలో స్పైడర్ మ్యాన్ శరీరంలో ఊహించని మార్పులు జరుగుతుంటాయి.హార్మోన్ల ప్రతిస్పందన తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు పడుతూ ఉంటాడు. మరోవైపు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్యామేజ్ కంట్రోల్‌పై ఓ అదృశ్య శక్తి దాడులు చేస్తూ వీ మ్యాక్స్ కోసం వెతుకుతూ ఉంటుంది. అసలు డీసీసీపై దాడి చేస్తున్న ఆ అదృశ్య శక్తి ఏంటి? వి మ్యాక్స్ అంటే ఏంటి? ఆ శక్తిని ఎదుర్కొనేందుకు స్పైడర్ మ్యాన్ ఏం చేశాడు? ఈ క్రమంలో అతనికి ఎదురైన సవాళ్లేంటి? తన ప్రియురాలికి పీటర్ పార్కర్ ఎలా గుర్తొచ్చాడు? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

## పెద్ది విగ్రహ గద్దే కూల్చివేత

నర్సంపేట దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ గద్దె ను అధికారులు కూల్చేసారు. నర్సంపేటలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎదురుగా పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి గద్దె కూల్చివేత నిర్మించారు. అయితే, విగ్రహ ఏర్పాటుకు అనుమతి లేదంటూ మున్సిపాలిటీ అధికారులు కూల్చివేసారు. ప్రైవేట్ స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నా కూడా అనుమతి లేదంటూ రాత్రి వేళ అక్రమంగా కూల్చివేసారు.

## తిరుమలలో శ్రీవారి దర్శనానికి 20 గంటల సమయం

తిరుమలలో భక్తుల రద్దీ తీవ్రంగా ఉంది. సోమవారం ఉదయం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌ని అన్ని కంపార్ట్మెంట్లు నిండిపోవడంతో భక్తులు వెలుపల ఉన్న క్యూలైన్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 20 గంటల సమయం పడుతోంది. నిన్న ఒక్కరోజే 87,179 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 34,256 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.59 కోట్లు వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.

## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

నంధ్యాల ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 43,580 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ఔట్ ఫ్లో 4,600 క్యూసెక్కులుగా నమోదైంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 878.60 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పరిధిలోని కుడి జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుండగా, ఎడమ జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని నిలిపివేశారు.

## బీజేపీతో మళ్లీ పొత్తుకు శిరోమణి అకాలీదళ్ పార్టీ ప్రయత్నాలు

ఛండీఘడ్ ఆగస్టు 10, (న్యూస్ పల్స్) ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంలోని మోదీ సర్కారు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటుచేసి, నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చింది. అయితే, ఈ రాజ్యాంగ సవరణ బిల్లు మూడింట రెండొంతుల మెజార్టీ సాధించలేక వీగిపోయింది. దీంతో మరోసారి ఈ బిల్లును తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మద్దతు కూడగట్టి, ఎలాగైనా గట్టెక్కించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే బిల్లుకు తాజాగా ఎస్ఏడీ మద్దతు ప్రకటించింది.బీజేపీ, అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తుందనే ఊహాగానాల నడుమ కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పంజాబ్‌కు చెందిన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాలీదళ్ బహిరంగంగా మద్దతు ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ భేటీ అయిన మర్నాడే ఈ ప్రకటన వెలువడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. అకాలీదళ్.. బీజేపీ కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని ఈ నిర్ణయం స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది.కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ప్రణాళికను సమర్థిస్తూ.. దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని బాదల్ శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో స్థానాలను సమానంగా 50 శాతం పెంచాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎస్ఏడీ మద్దతు ఇస్తుందని తెలిపారు. "చండీగఢ్‌లో జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశాం.. మహిళల గౌరవం, సమానత్వం, సమాన హక్కుల కోసం పోరాడిన సిక్కు గురువుల బోధనల నుంచి శిరోమణి అకాలీదళ్ స్ఫూర్తి పొందుతుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఇప్పటికే తన సభలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆదర్శంగా నిలిచింది. పార్లమెంట్ ముందుకు వచ్చిన కీలక అంశాలపై చర్చించిన అనంతరం, అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా న్యాయమైన డిలిమిటేషన్ జరగాలని భావిస్తున్నాం. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'అన్ని రాష్ట్రాల్లో 50% స్థానాల సమాన పెంపు' ప్రతిపాదనకు మేము మద్దతు ఇస్తున్నాం' అని బాదల్ వెల్లడించారు. ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో డిలిమిటేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టినప్పుడు అకాలీదళ్ దానిని తీవ్రంగా వ్యతిరేకించి, ప్రతిపక్షాలతో కలిసి వ్యతిరేకంగా ఓటు వేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పంజాబ్‌కు తక్కువ స్థానాలు పెరుగుతాయని, ఇది పంజాబ్‌కు వివక్షపూరితమైనదని అప్పట్లో పేర్కొంది. కానీ, ఇప్పుడు పొత్తు చర్చలు వేగం పుంజుకోవడంతో 50% స్థానాల పెంపు హామీతో ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.2020లో వివాదాస్పద వ్యవసాయ చట్టాలతో బీజేపీ, అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాల బంధం తెగిపోయింది. ఆ సమయంలో ఎన్డీయే కూటమి నుంచి అకాలీదళ్ బయటకు వచ్చింది. ఆ తర్వాత 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీలు ఒంటరిగానే పోటీ చేశాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది.పార్లమెంట్‌లో ప్రధానితో బాదల్ శుక్రవారం భేటీ కావడంతో కూటమి పునరుద్ధరణపై ప్రచారం మొదలైంది. పంజాబ్ బీజేపీ వర్గాలు, ఎస్ఏడి, ఆర్ఎస్ఎస్‌లతో పాటు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన నేతలు కూడా పొత్తుకు అనుకూలంగా ఉన్నారు. దీనిపై బీజేపీ కేంద్ర నాయకత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.గతంలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషించగా.. బీజేపీ చిన్న భాగస్వామిగా ఉండేది. కానీ, ఈసారి సమాన ప్రాతిపదికన పొత్తు ఉండాలని బీజేపీ కోరుతున్నట్లు సమాచారం. సీట్ల సర్దుబాటు వంటి వివరాలను తర్వాత చర్చించవచ్చని, పంజాబ్ పరిస్థితులను మెరుగుపరచడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యత అని అకాలీదళ్ నేతలు చెబుతున్నారు

# విజయ్ వర్సెస్ స్టాలిన్



చెన్నై, ఆగస్టు 10, విజయ్ పిలిచారు.. స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు రాలేదు. అన్నాడీఎంకే కూడా దూరంగానే నిలిచింది. మరోవైపు కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, ఎండీఎంకేకు చెందిన ఎంపీలు మాత్రం విజయ్‌తో కలిసి కూర్చున్నారు. అంటే విజయ్ పిలుపును పూర్తిగా తిరస్కరించిన పరిస్థితి లేదు. అదే సమయంలో అన్ని పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావాలన్న లక్ష్యం కూడా పూర్తిగా నెరవేరలేదు. అందుకే ఈ సమావేశాన్ని విజయ్ విజయం అనీ.. వైఫల్యం అనీ ఒక్క మాటలో చెప్పలేం.అసలు డీలిమిటేషన్ అంటే నియోజకవర్గాల పునర్విభజన. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పునఃసర్దుబాటు చేస్తే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్నది తమిళనాడు పార్టీల ఆందోళన. కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణ వంటి అంశాల్లో ముందున్న రాష్ట్రాలకు.. తర్వాత పెరిగిన జనాభా ఆధారంగా రాజకీయ ప్రాతినిధ్యం తగ్గించడం న్యాయం కాదన్న వాదన చాలాకాలంగా ఉంది. అందుకే డీలిమిటేషన్ తమిళనాడులో కేవలం నియోజకవర్గాల లెక్క కాదు.. రాష్ట్ర హక్కుల అంశంగా మారింది.ఈ అంశంపై డీఎంకే ఇప్పటికే పోరాటం చేస్తోంది. స్టాలిన్ నేతృత్వంలో గతంలోనే అఖిలపక్ష సమావేశాలు కూడా జరిగాయి. తమిళనాడుకు అన్యాయం జరగకూడదన్న వాదనను డీఎంకే జాతీయ స్థాయిలో కూడా వినిపించింది. అంటే డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటం విజయ్‌తో మొదలైంది కాదు. మరి ఇప్పుడు విజయ్ అదే అంశంపై ప్రత్యేకంగా ఎంపీల సమావేశం ఎందుకు పెట్టారు? అన్నదే అసలు రాజకీయ ప్రశ్న.ఇక్కడే విజయ్ రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. ఒక సమస్యపై అన్ని పార్టీలను ఒకే టేబుల్ దగ్గరకు తీసుకురావడం ద్వారా తాను కేవలం ఒక పార్టీ అధినేతను కాదని.. తమిళనాడు ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని వెళ్లగల నాయకుడిననే ఇమేజ్‌ను నిర్మించుకోవాలని చూస్తున్నారా? అన్న చర్చ మొదలైంది. ఎందుకంటే ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓడించడం ఒక రాజకీయ విజయం. కానీ ప్రత్యర్థి పార్టీలతో కూడా ఒక రాష్ట్ర ప్రయోజనం కోసం మాట్లాడగల స్థాయిని చూపించడం మరో రకమైన నాయకత్వ పరీక్ష.అయితే ఈ సమావేశానికి స్టాలిన్ రాకపోవడమే ఇప్పుడు విజయ్‌కి అతిపెద్ద రాజకీయ ప్రశ్నగా మారింది. స్టాలిన్ వచ్చి ఉంటే కథ మరోలా ఉండేది. విజయ్ పిలుపునకు స్పందించి స్టాలిన్ కూడా అదే వేదికపై కూర్చుని తమిళనాడు హక్కుల కోసం కలిసి పోరాడతామని ప్రకటించి ఉంటే.. విజయ్ రాజకీయ ఇమేజ్‌కు అది భారీ బూస్ట్ అయ్యేది. తనకంటే సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న స్టాలిన్‌ను కూడా ఒక సమస్యపై తన వేదికపైకి తీసుకురాగలిగాడనే ప్రచారం జరిగేది.కానీ స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు కూడా రాలేదు. ఇది విజయ్‌కు ఒకవైపు ఎదురుదెబ్బే. కానీ రాజకీయంగా మరో అవకాశం కూడా. ఎందుకంటే ఇప్పుడు విజయ్ ప్రజల్లో ఒక ప్రశ్నను బలంగా తీసుకెళ్లవచ్చు. తమిళనాడు కోసం అందరినీ పిలిచాను.. కలిసి మాట్లాడుదామని చెప్పాను. ఎవరు వచ్చారు? ఎవరు రాలేదనేది మీరు చూశారని చెప్పొచ్చు. రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో ప్రత్యర్థి గైర్హాజరు కూడా ప్రచార ఆయుధంగా మారుతుంది. స్టాలిన్ విజయ్ వేదికపైకి వచ్చి ఉంటే.. విజయ్‌కి ఒక రోజు రాజకీయ మైలేజ్ వచ్చేది. రాకపోవడంతో.. విజయ్ దాన్ని ఒక నేరేటివ్‌గా మార్చుకునే అవకాశం వచ్చింది.అయితే ఇక్కడ మరో లెక్క ఉంది. తమిళనాడుకు చెందిన మొత్తం 57 మంది ఎంపీల్లో 20 మంది మాత్రమే సమావేశానికి రావడం అంటే దాదాపు 35 శాతం మంది మాత్రమే హాజరైనట్టే. మిగిలిన 37 మంది.. అంటే దాదాపు 65 శాతం మంది రాలేదు. కాబట్టి దీనిని అన్ని పార్టీల ఏకాభిప్రాయ సమావేశంగా చెప్పడం సాధ్యం కాదు. కానీ వచ్చిన 20 మంది వివిధ పార్టీలకు చెందినవారు కావడం మాత్రం విజయ్‌కు రాజకీయంగా ఉపయోగపడే అంశం.ముఖ్యంగా కాంగ్రెస్ రావడం.. డీఎంకే దూరంగా ఉండటం ఆసక్తికరమైన పరిణామం. డీఎంకేకు కాంగ్రెస్‌తో రాజకీయ సంబంధం ఉన్నప్పటికీ.. విజయ్ ఏర్పాటు చేసిన వేదికకు కాంగ్రెస్ ఎంపీలు రావడం ద్వారా డీలిమిటేషన్‌ను పార్టీ రాజకీయాలకు అతీతమైన అంశంగా చూడాలన్న వాదన బలపడింది. అయితే దీన్ని వెంటనే కాంగ్రెస్–డీఎంకే మధ్య విభేదాలకు సంకేతంగా చూడటం తొందరపాటే అవుతోంది. కానీ విజయ్ మాత్రం ఈ పరిణామాన్ని తన రాజకీయ ప్రయోజనానికి ఉపయోగించుకునే అవకాశం ఉంది.ఇప్పటివరకు తమిళ రాజకీయాల్లో ప్రధాన పోరు డీఎంకే వర్సెస్ అన్నాడీఎంకే. రెండు పెద్ద రాజకీయ ధృవాల చుట్టూనే ఎన్నికలు తిరిగేవి. ఇప్పుడు విజయ్ రంగంలోకి వచ్చారు. 2026 రాజకీయ సమీకరణాల్లో ఆయన ఎదుగుదలతో పాత లెక్కలకు కొత్త సవాలు ఎదురైంది. అందుకే డీలిమిటేషన్ వంటి రాష్ట్ర హక్కుల అంశం విజయ్‌కు కేవలం ఒక విధానపరమైన అంశం కాదు.. తన నాయకత్వాన్ని ప్రదర్శించుకునే రాజకీయ వేదిక కూడా.అయితే విజయ్ ముందున్న అసలు పరీక్ష ఇక్కడే ఉంది. ఒక సమావేశం పెట్టడం సులువు.. ఆ సమావేశాన్ని ఉద్యమంగా మార్చడం కష్టం. డీలిమిటేషన్‌పై నిజంగా పోరాడాలంటే పార్లమెంట్‌లో ఎంపీలను సమన్వయం చేయాలి. దక్షిణాది రాష్ట్రాలతో కలిసి వెళ్లాలి. కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. కేవలం తమిళనాడు ఎన్నికల రాజకీయాలకు పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. అప్పుడు మాత్రమే విజయ్ “తమిళ హక్కుల కోసం అందరినీ కలిపే నాయకుడు” అనే ఇమేజ్ బలపడుతుంది.లేకపోతే డీఎంకే నుంచి మరో కౌంటర్ రావచ్చు. డీలిమిటేషన్‌పై మేము ఎప్పటి నుంచో పోరాడుతున్నాం. కొత్తగా విజయ్ వచ్చి మీటింగ్ పెట్టడం వల్ల ఇది కొత్త పోరాటం కాదని చెప్పే వీలుంది. అదే విజయ్‌కు పెద్ద సవాలు. ఎందుకంటే డీలిమిటేషన్ అనే అంశంపై స్టాలిన్‌కు రాజకీయ చరిత్ర ఉంది. విజయ్‌కు మాత్రం ఈ అంశంపై రాజకీయంగా కొత్త అధ్యాయం మొదలవుతోంది.అందుకే ఈ సమావేశానికి కేవలం “20 మంది ఎంపీలు వచ్చారు.. 37 మంది రాలేదు” అనే అంకెలతో చూడటం సరిపోదు. అసలు కథ.. ఎవరు వచ్చారు, ఎవరు రాలేదు.. ఎందుకు రాలేదు.. విజయ్ ఈ వేదికను తర్వాత ఎలా ఉపయోగించబోతున్నారు అన్నదే. స్టాలిన్ రాలేదు కాబట్టి విజయ్ ఓడిపోయారని చెప్పలేం. 20 మంది వచ్చారు కాబట్టి విజయ్ గెలిచారని కూడా చెప్పలేం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. డీలిమిటేషన్ పోరాటం పాతదే.. దానిపై విజయ్ వేసిన రాజకీయ అడుగు మాత్రం కొత్తది.స్టాలిన్ దగ్గర ఈ అంశంపై అనుభవం ఉంది. విజయ్ దగ్గర కొత్త రాజకీయ ఉత్సాహం ఉంది. ఒకరి దగ్గర పోరాట చరిత్ర ఉంటే.. మరొకరు దానికి కొత్త రాజకీయ వేదికను నిర్మించాలనుకుంటున్నారు. అందుకే విజయ్ పిలుపు.. స్టాలిన్ దూరం అనేది కేవలం ఒక సమావేశం కథ కాదు.తమిళనాడు హక్కుల పేరుతో మొదలైన ఈ పోరు.. రేపటి తమిళ రాజకీయాల్లో నాయకత్వ పోరుగా మారుతుందా? డీలిమిటేషన్ సీట్లను మారుస్తుందో లేదో వేచి చూడాలి.

# రెంట్ బాయ్‌ఫ్రెండ్ తో జరాభద్రం

హైదరాబాద్, ఆగస్టు 10, సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్.. సోషల్ మీడియాలో జరుగుతున్న మరో మోసంపై యువతను అప్రమత్తం చేశారు. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో నెట్టింట జరుగుతున్న ప్రచారం వెనుక ఉన్న మోసాలను వివరిస్తూ అమ్మాయిలు, యువతులను అలర్ట్ చేశారు. ఆకర్షణీయమైన కుర్రాళ్ల ఫోటోలు పెట్టి, అమ్మాయిలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఇలాంటి కేటుగాళ్ల వలలో పడొద్దంటూ హెచ్చరించారు. ఇలాంటి మోసాలను గమనిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియాలో జరిగే మోసాల నుంచి సైబర్ నేరాల వరకూ ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్. ముఖ్యంగా యువతీ, యువకులు మోసాలకు గురికాకుండా సోషల్ మీడియా ద్వారావారిని అలర్ట్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే రెంట్ బాయ్‌ఫ్రెండ్ పేరుతో నెట్టింట జరుగుతున్న మోసాలపై మరోసారి యువతను అప్రమత్తం చేశారాయన. ఆగస్ట్ నెలలో రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు వల వేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. అలర్ట్‌గా ఉండాలని అమ్మాయిలకు సూచించారు.ఒంటరితనంతో బాధపడుతున్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అది కూడా 50 శాతం ఆఫర్లతో అంటూ సోషల్ మీడియాలో కలర్‌ఫుల్‌గా కనిపించే పోస్టర్ల వెనుక సైబర్ మోసం దాగి ఉందని.. అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు విసురుతున్న కొత్త డేటింగ్ ట్రాప్ ఇదంటూ సజ్జనార్ హెచ్చరించారు. ఫేస్ బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లోఆకర్షణీయంగా ఉండే అబ్బాయిల ఫోటోలను చూపిస్తూ.. కాఫీ మీటింగ్, సినిమా డేట్, షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లు, ఫుల్ డే ప్యాకేజీ అంటూ కేటుగాళ్లు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. గోప్యత, భద్రత పాటిస్తామని, అక్రమ వ్యాపారం కాదని నమ్మబలుకుతూ బుకింగ్స్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతూ నెట్టింట ప్రచారం చేస్తున్నారని సజ్జనార్ వివరించారు.”ఏఐతో సృష్టించిన, ఇంటర్నెట్ నుంచి సేకరించిన అందమైన కుర్రాళ్ల ఫోటోలను ప్రొఫైల్ పిక్చర్లుగా పెట్టి, మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో సంభాషణలు మొదలుపెడతారు. బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ అమౌంట్ పేరుతో డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసి, ఆపై అకౌంట్లను బ్లాక్ చేస్తారు. ఆన్‌లైన్ సంభాషణలు నమ్మి అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడానికి వెళ్తే వారు మిమ్మల్ని సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉంది. ప్రేమ పేరుతో అబద్ధాలు చెప్పి మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చాటింగ్ క్రమంలో చాకచక్యంగా సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత ఫోటోల ఆధారంగా ఆ తర్వాత బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది.” అని సజ్జనార్ యువతులు, అమ్మాయిలను అప్రమత్తం చేశారు.సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ రకమైన మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం దృష్టిసారించిందని.. వీటికి బాధ్యులైన వారిపై వేగంగా దర్యాప్తు చేసి.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో అమ్మాయిలతో పాటుగా, వారి తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. తమ పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? బయట ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.సోషల్ మీడియాలో ఇలాంటి కేటుగాళ్లు ఇచ్చే డిస్కౌంట్ ఆఫర్లను చూసి మోసపోవద్దని.. అపరిచిత వ్యక్తులతో చాటింగ్, కలవడం కానీ చేయవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి సైబర్ కేటుగాళ్ల బారినపడినా, లేదా అనుమానాస్పద పోస్టులు గమనిస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కి కాల్ చేయాలని.. లేదంటే ఇ‌ఎవవతీఇతీతిఎవ.ఐనీల.తిని పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు.

# బీసీల సెంట్రిక్ గా కవిత



హైదరాబాద్, ఆగస్టు 10, తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్న మాజీ ఎంపీ, మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత.. ఇప్పుడు వ్యూహం మార్చుకున్నట్టు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు తెలంగాణ సెంటిమెంటు, ఉద్యమ కారులు.. వారి హక్కులు, ఉద్యోగాలు అంటూ.. రాజకీయ నినాదాలు చేసిన కవిత.. వీటి వల్ల వర్కవుట్ కాదని అర్థం చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె.. తన పంథాను సమూలంగా మార్చుకున్నట్టు కనిపిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణలో బీసీ సామాజిక వర్గం అధికారిక లెక్కల ప్రకారం.. 43 శాతం మంది ఉన్నారు. అనధికారికంగా 50 శాతం వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీలను తనవైపు తిప్పుకునే దిశగా కవిత రాజకీయాలకు పదును పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీ ఓటు బ్యాంకు నికరంగా ఎవరికీ ఎడాప్ట్ కాలేదు. బీఆర్ఎస్ అయినా.. బీసీ గణనను తొలిసారి నిర్వహించామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకైనా బీసీలు పూర్తిగా అంకితం కాలేదు. ఈ నేపథ్యంలో వారిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు కవిత ప్రయత్నం చేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే బీసీల హక్కుల సాధన, ఏపీలో చేస్తున్న బీసీల రక్షణ హక్కు చట్టం తరహాలో తెలంగాణలోనూ బీసీలకు రక్షణ హక్కు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు.. రాజకీయంగా అదేవిధంగా రాజ్యాంగ పరంగా కూడా.. బీసీలకు 50 శాతం పదవులు కేటాయించాలని కోరుతున్నారు. వాస్తవానికి కవిత బీసీ కాకపోయినా.. ఆ వర్గాన్ని తనదైన శైలిలో తనవైపు తిప్పుకొనేందుకు బీసీల సమస్యలను భుజాని వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం నినాదాలకే పరిమితం కారాదని కూడా కవిత నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.బీసీల కోసం ఉద్యమం చేయాలనే దిశగా కవిత ఆలోచన చేస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంటు నుంచే ఆమె పని ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించిన తరహాలో బీసీల కోసం.. వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించి.. ఢిల్లీ నుంచే తన వ్యూహాన్ని పెంచాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కార్యాచరణపై ప్రస్తుతం కవిత కసరత్తు చేస్తున్నారు. ఇది అయిన తర్వాత.. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కోసం ఉద్యమం నిర్మించి.. జిల్లాల వారీగా పర్యటనలు చేయాలనినిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇది ఏమేరకు వర్కవుట్ అవుతుందో చూడాలి.

# రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. వయా పాకిస్థాన్..!

న్యూఢిల్లీ, ఆగస్టు 10, రష్యా నుంచి భారత్‌కు రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆ దేశ ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ప్రతిపాదించారు. ఈ మార్గం తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా సాగి హిందూ మహాసముద్రానికి చేరు కునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో అనుసంధానమయ్యే ఏ మార్గ మైనా పరిశీలించేందుకు అనుకూల మేనని స్పష్టం చేశారు. బోస్ఫరస్, హర్మూజ్ జల సంధుల వద్ద ఎదురయ్యే భద్రతా, వాణిజ్యపరమైన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ భూభాగ మార్గాల అవసరం పెరుగుతోందని రష్యా భావిస్తోంది. రష్యా నుంచి భారత్‌కు రైలులో సరుకు రవాణా చేసే మార్గం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని కీలక సముద్ర వాణిజ్య మార్గాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో.. సముద్ర మార్గాలకు ప్రత్యామ్నాయంగా భారీ రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేసే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తోంది. రష్యా ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ఈ ప్రతిపాదనను ప్రస్తావించారు. రష్యా నుంచి హిందూ మహాసముద్రం వరకు రైల్వే లింక్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆయన సూచించారు. తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా ఈ రైల్వే మార్గాన్ని తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్‌కు చేరుకునే అవకాశం కల్పించే ఏ రూట్ అయినా తమకు పరిశీలనీయమేనని పేర్కొన్నారు.బోస్ఫరస్, హోర్ముజ్ జలసంధులపై ఆధారపడే అంతర్జాతీయ వాణిజ్య మార్గాలకు భద్రతాపరమైన ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో రష్యా ఈ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు నాలుగో వంతు, ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాల్లో దాదాపు ఐదో వంతు ఈ ప్రాంతం గుండా సాగుతుందని అంచనా. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది.ఇటీవలి కాలంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు పెరగడంతో హర్మూజ్ జలసంధి ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో సముద్ర మార్గాల్లో అంతరాయాలు ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు అవసరమని రష్యా భావిస్తోంది. రష్యా ప్రతిపాదనల ప్రకారం సాధ్యమైన రైల్వే కారిడార్ తుర్క్‌మెనిస్తాన్ నుంచి ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా హిందూ మహాసముద్రంకు చేరేలా ఉండనుంది. ఈ మార్గం పూర్తిగా అమలులోకి వస్తే రష్యాకు సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని కొంత మేర తగ్గించే అవకాశం ఉంటుంది.ముఖ్యంగా భారత్‌తో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ తరహా భూభాగ రవాణా మార్గం ఉపయోగపడే అవకాశం ఉందని రష్యా భావిస్తోంది. అయితే ప్రతిపాదిత మార్గంలో ఉన్న దేశాల భౌగోళిక, భద్రతా, రాజకీయ పరిస్థితులు, మౌలిక వసతులు వంటి అనేక అంశాలు ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను ప్రభావితం చేయనున్నాయి. రష్యా చేస్తున్న ప్రతిపాదనలో భారత్‌కు అనుసంధానం కల్పించే మార్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం కనిపిస్తోంది. భారత్‌కు చేరుకునే అవకాశం ఉన్న ఏ రూట్ అయినా పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా ఉప ప్రధాని పేర్కొనడం దీనికి సంకేతంగా భావిస్తున్నారు. ఇలాంటి రైల్వే కారిడార్ అందుబాటులోకి వస్తే రష్యా–భారత్ మధ్య సరుకు రవాణాకు కొత్త మార్గం ఏర్పడే అవకాశం ఉంటుంది. సముద్ర రవాణాలో అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో ప్రత్యామ్నాయ మార్గంగా ఇది ఉపయోగపడవచ్చు. అయితే ఇది ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. మార్గం ఖరారు, నిర్మాణ వ్యయం, దేశాల మధ్య ఒప్పందాలు, భద్రతా అంశాలు వంటి అనేక దశలను దాటాల్సి ఉంటుంది.మొత్తంగా చూస్తే.. సముద్ర వాణిజ్య మార్గాల్లో పెరుగుతున్న భద్రతా సవాళ్లకు ప్రత్యామ్నాయంగా రష్యా భూభాగ రవాణా మార్గాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. రష్యా నుంచి హిందూ మహాసముద్రం, అక్కడి నుంచి భారత్‌తో కనెక్టివిటీ సాధ్యమైతే.. భవిష్యత్తులో రెండు దేశాల వాణిజ్య సంబంధాలకు ఇది కీలకమైన కొత్త మార్గంగా మారే అవకాశం ఉంది.

# తాడిపత్రిలో ఉద్రిక్తత
## పెద్దారెడ్డిని అడ్డగించిన పోలీసులు

తాడిపత్రి  డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, నారా లోకేష్ రాజీనామా చేయాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. పెద్దారెడ్డి స్వగృహం వద్ద పోలీసులతో వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో తాడిపత్రిలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# 95 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ కు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటులో కీలక ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 టీపీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటికే తొలి మోడల్ పాఠశాలగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో ఏర్పాటు చేసిన స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందించేలా సదుపాయాలు కల్పించారు.తాజాగా మరో 95 పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. వీటి నిర్మాణానికి మొత్తం రూ.928 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో పాఠశాలకు భూమి, భవన పరిమాణం, మౌలిక సదుపాయాలను బట్టి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఖర్చు కానుంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపించారు.95 పాఠశాలల నిర్మాణాలకు అవసరమైన పరిపాలనా అనుమతుల కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యమంత్రి ఆమోదం అనంతరం ఉత్తర్వులు వెలువడితే టెండర్ల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా 2027-28 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలన్న నిర్ణయం నేపథ్యంలో టీపీఎస్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం పెరిగింది.ఈ పాఠశాలలకు అవసరమైన నిధుల్లో 70 శాతం, అంటే సుమారు రూ.650 కోట్లను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణం ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మిగిలిన 30 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనున్నారు. విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏఐఐబీ, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి భారీగా రుణాలు సమీకరించే ప్రణాళికలో భాగంగానే ఈ నిధులను వినియోగించనుంది. రుణం అందడంలో ఆలస్యం ఏర్పడినా పనులు ఆగిపోకుండా రాష్ట్ర నిధులతో తొలిదశ నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ఏఐఐబీ తరఫున కన్సల్టెన్సీ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ సంబంధిత అధికారులతో ప్రాజెక్టు అమలు, మౌలిక సదుపాయాలు, నిర్మాణ ప్రమాణాలపై చర్చలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.టీపీఎస్‌లను కేవలం పాఠశాల భవనాలుగా కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించేలా మౌలిక వసతులు కల్పించనున్నారు. తరగతి గదులతోపాటు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, లైబ్రరీలు, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలను కల్పించనున్నారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే ఆధునిక తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, క్రీడా వసతులు, ఉచిత రవాణా వంటి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు.విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించడంతోపాటు పాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే అచ్చంపేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు రెండేసి టీపీఎస్‌లు మంజూరు కాగా.. గజ్వేల్‌కు కూడా పాఠశాలను కేటాయించారు. ఆరుట్లలో ప్రారంభమైన తొలి టీపీఎస్ నమూనాగా మిగిలిన పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా 100 టీపీఎస్‌ల ఏర్పాటుతో ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంచి, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది

# బిగ్ ప్లాన్ లో బీజేపీ

హైదరాబాద్, ఆగస్టు 10, తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత పట్టు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కమలనాథులు, ఈసారి ఎలాగైనా తెలంగాణ గద్దెనెక్కాలనే స్పష్టమైన దిశానిర్దేశంతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో జరిగిన కీలక సమీక్షా సమావేశం, రాబోయే రోజుల్లో బీజేపీ అనుసరించబోయే రాజకీయ వ్యూహానికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది.తెలంగాణ బీజేపీకి ప్రధాన ప్రతిబంధకంగా మారిన పాత, కొత్త నేతల మధ్య విభేదాలను, అంతర్గత కలహాలను వెంటనే పక్కన పెట్టాలని పార్టీ అధిష్ఠానం స్పష్టం చేసింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, రఘునందన్ రావు సహా ముఖ్య నేతలందరూ ఒకే తాటిపైకి వచ్చి పోరాడాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. గతంలో కరీంనగర్, మేడ్చల్ అర్బన్, వికారాబాద్ జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకంపై నలుగుతున్న వివాదాలను సైతం బండి సంజయ్, ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డిల సూచనలకు ప్రాధాన్యం ఇస్తూ సర్దుబాటు చేయడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఐక్యతను నింపే ప్రయత్నం జరిగింది.భవిష్యత్తులో బీఆర్ఎస్ లేదా ఇతర పార్టీలతో పొత్తులు ఉంటాయనే ప్రచారాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముగింపు పలికారు. రాబోయే ఎన్నికల్లో జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికల్లోనైనా తెలంగాణలో ఏ ఇతర పార్టీతోనూ పొత్తు ఉండదని, ఒంటరిగానే పోటీ చేస్తామని తేల్చి చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో సమీకరణాలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ స్వయం సమృద్ధి దృష్ట్యా ఒంటరి పోరాటమే శ్రేయస్కరమని పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో గణనీయమైన ఓటు బ్యాంకు సాధించామని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం సీట్ల సంఖ్య పెరిగితే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత సత్తా సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, యువత సమస్యలపై పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ధర్నాలు, నిరసనలు చేపడుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' వంటి ఫలాలను పేదలకు చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు.మండల స్థాయి నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ప్రతి నెలా నిలకడగా సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతీ మూడు నెలలకోసారి కేంద్రీయ నేతలు రాష్ట్రాన్ని సందర్శించేలా పక్కా ప్రణాళిక రూపుదిద్దుకుంది. నేతల మధ్య ఉన్న చిన్న చిన్న భేదాభిప్రాయాలు పక్కనబెట్టి, వ్యూహాత్మకంగా ముందుకు సాగితే తెలంగాణ పీఠం దక్కడం అసాధ్యమేమీ కాదని కమలనాథులు భావిస్తున్నారు.

బండి సంజయ్ నివాసంలో సమావేశాలు..

బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాజకీయాల్లో మరో మలుపు తీసుకుంటూ వ్యూహాత్మకంగా కదులుతోంది. ఒకవైపు వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్, గుజరాత్‌లో గెలుపుపై దృష్టి సారించిన కమలం పార్టీ మరోవైపు దక్షిణాన పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటక తర్వాత గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో పార్టీలో జోష్ పెంచడంతోపాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేలా వ్యూహాలు రూపొందిస్తోంది. త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ పోరులో విజయం సాధించాలనే లక్ష్యంతో కేంద్ర స్థాయి నుంచి స్పష్టమైన దిశానిర్దేశం జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీని వేదికగా రాష్ట్ర నాయకుల సమావేశాలు జరగడం, పార్టీలో సమన్వయాన్ని పెంచే ప్రయత్నాలు ఈ వ్యూహానికి ప్రధాన అంశాలుగా మారాయి.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ బలమైన పనితీరు చూపాలనే ఆలోచనతో బీజేపీ అధిష్ఠానం పని చేస్తోంది. హైదరాబాద్‌లోని మున్సిపల్ ఎన్నికలు పార్టీకి కీలక పరీక్షగా మారనున్న నేపథ్యంలో, రాష్ట్ర స్థాయి నాయకత్వం, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత బలం పెంచే దిశగా చర్చలు సాగుతున్నాయి. కేవలం ఎన్నికల క్యాంపెయిన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక రాజకీయ బలాన్ని నిర్మించే దృష్టితో వ్యూహాలు రూపొందుతున్నట్లు అర్థమవుతోంది.ఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం రాష్ట్ర నాయకుల సమావేశాలకు ముఖ్య వేదికగా మారింది. ఇక్కడ జరుగుతున్న చర్చలు కేవలం సాధారణ సమావేశాలుగా కాకుండా, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలకు దారితీస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులు, కేంద్ర నాయకత్వం మధ్య నేరుగా సంప్రదింపులు జరగడం వల్ల సమస్యలను త్వరగా గుర్తించి, పరిష్కార మార్గాలు చర్చించే అవకాశం ఏర్పడుతోంది. ఇది పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించే దిశగా ఉన్నట్లు కనిపిస్తోంది.పార్టీలోని వర్గ విభేదాలను అధిగమించి, ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశం అధిష్ఠానం నుంచి స్పష్టంగా వస్తోంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో జరిగిన చర్చల్లో ఈ అంశం ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయం సాధించాలంటే అంతర్గత సమస్యలు అడ్డంకిగా మారకూడదనే అవగాహనతో, నాయకుల మధ్య సమన్వయం పెంచే చర్యలు చేపట్టబడుతున్నాయి. ఇది పార్టీ సంస్థాగత బలాన్ని పెంచి, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవకాశం కలిగిస్తుంది.ఢిల్లీలో జరుగుతున్న ఈ కదలికలు తెలంగాణలో బీజేపీ స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసే ప్రయత్నంగా భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు అంతర్గత ఐక్యతను నిర్ధారించుకోవడం, స్పష్టమైన బాధ్యతల పంపిణీ, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం వంటివి ఇప్పుడు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ వ్యూహం ఎంతవరకు ఫలితాలు ఇస్తుందనేది రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షాల పనితీరు, ప్రజా స్పందనపై ఆధారపడి ఉంటుంది. అయితే అధిష్ఠానం స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడం, సమన్వయాన్ని ప్రోత్సహించడం పార్టీకి సానుకూల సంకేతంగా నిలుస్తోంది.మొత్తంమీద ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ చర్చలు, సమావేశాలు తెలంగాణలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల లక్ష్యం, అంతర్గత ఐక్యత, సంస్థాగత సమన్వయం ఈ మూడు అంశాలపై దృష్టి సారించి అధిష్ఠానం ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

# తెలంగాణ కేబినెట్ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్..

హైదరాబాద్, ఆగస్టు 10, తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతోపాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే, కేబినెట్ నుంచి ఒకరికి ఉద్వాసన పలుకుతారని గతంలో ప్రచారం జరిగినప్పటికీ.. ప్రస్తుతం ఆమేరకు అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం అందరిలో ఉత్కంఠ నెలకొంది.

పక్క రాష్ట్రమైన కర్ణాటలో మంత్రివర్గ విస్తరణ పూర్తయిన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తన ఫోకస్‌ను తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పెట్టినట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. పలువురు సీనియర్, జూనియర్ ఎమ్మెల్యే మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వాలంటూ ఇప్పటికే పలు దఫాలుగా కేంద్ర పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పలు సందర్భాల్లో బహిరంగంగానూ మంత్రి పదవి దక్కలేదని తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యే మంత్రి పదవి కోసం తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఈసారి కేబినెట్ విస్తరణలో ఎవరికి అదృష్టం వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.కేబినెట్ విస్తరణకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతో పాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రెండు బెర్త్ లలో ఎస్టీ, రెడ్డి సామాజిక వర్గాల వారికి చాన్స్ దక్కే అవకాశం ఉంది. ఎస్టీ సామాజిక వర్గం నుంచి రేసులో రామచంద్రు నాయక్, బాలు నాయక్ లు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఒకరికి మంత్రి పదవి దక్కేఅవకాశాలు ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మరోవైపు.. రెడ్డి సామాజిక వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, సుందర్శన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి.తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదు. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ కొనసాగుతున్నారు. అయితే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి కేటాయించాలని స్థానిక నేతలు కోరుతున్నారు. అధిష్ఠానం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాధాన్యం ఇస్తే.. ఆ జిల్లాకు చెందిన మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిలలో ఎవరికో ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. మరోవైపు.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రేసులో సుందర్శన్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. మరో పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ పూర్తవుతుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటుండగా.. వీరిలో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది.

ఈసారి మంత్రి వర్గ విస్తరణలో భాగంగా ప్రస్తుత కేబినెట్‌లో కొనసాగుతున్న వారిలో ఒకరికి ఉద్వాసన పలికే అవకాశాల ఉన్నట్లుగా ఇటీవల కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే, ఇప్పుడు అలాంటిదేమీ లేదని తెలుస్తోంది.

ఒకవేళ ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న ఒకరికి ఉద్వాసన పలికితే అదే సామాజిక వర్గం నుంచి మరొకరికి చాన్స్ దక్కే అవకాశాలు ఉన్నాయి

## బాలినేని, దామచర్ల మధ్య తీవ్రమైన మాటల యుద్ధం

ఒంగోలు, ఆగస్టు 10 ఒంగోలు వేదికగా జనసేన నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మధ్య చోటుచేసుకుంటున్న మాటల యుద్ధంపై టీడీపీ, జనసేన పార్టీల అధిష్ఠానాలు తీవ్రంగా స్పందించాయి. నేతలిద్దరూ సంయమనం పాటించాలని, బహిరంగ విమర్శలకు దూరంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. ఈ వ్యవహారం కూటమి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని భావించిన ఇరు పార్టీల అగ్రనేతలు తక్షణమే రంగంలోకి దిగారు.ఈ పరిణామాలపై కూటమి సమన్వయ కమిటీ సభ్యులు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశంలో టీడీపీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలుంటే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలి తప్ప, బహిరంగ విమర్శలకు దిగడం కూటమి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తో నేరుగా మాట్లాడారు. సంయమనం పాటించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. అటు జనసేన నేతలు కూడా బాలినేనితో మాట్లాడారు.ఒంగోలు నియోజకవర్గంలో భూములు, ఇసుక, రేషన్ పంపిణీలో జరుగుతున్న అక్రమాల్లో ఎమ్మెల్యేకు భాగస్వామ్యం ఉందని, దీనిపై విచారణ జరిపించాలని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శలపై దామచర్ల జనార్ధన్ ధీటుగా స్పందిస్తూ, బాలినేని నియోజకవర్గానికి అప్పుడప్పుడు మాత్రమే వస్తుంటారని, గతంలో టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించారని, ఇప్పటికీ కూటమి ప్రయోజనాలకు వ్యతిరేకంగా, వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రకాశం జిల్లాలో ఈ అంతర్గత విభేదాలు కూటమికి రాజకీయంగా నష్టం చేకూర్చకూడదనే ఉద్దేశంతోనే ఇరు పార్టీల అధిష్ఠానాలు సత్వరమే జోక్యం చేసుకున్నాయి.

# టీపీసీసీలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్ల.. సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం

హైదరాబాద్, ఆగస్టు 10, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) నిర్మాణంలో ముఖ్యమైన మార్పులు రాబోతున్నట్లు కనిపిస్తోంది. పార్టీ అధికార వర్గం ఒకే వ్యక్తి చేతుల్లో అధికారం కేంద్రీకరించకుండా, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో కుల, వర్గ సమతుల్యతను కాపాడుకోవాలని వ్యూహాత్మకంగా టీపీసీసీ అడుగులు వేస్తోంది.పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలోనే ఈ విషయం ప్రధానంగా చర్చకు వచ్చింది. ఏఐసీసీ స్థాయి నుంచి టీపీసీసీలో నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించాలనే ప్రతిపాదనకు అంతా ఒకే చెప్పారు. ఇది స్థానిక నాయకత్వం, కేంద్ర నాయకత్వం మధ్య సమన్వయంతో జరుగుతున్న ప్రక్రియను సూచిస్తుంది. కేవలం ఒక చీఫ్‌పైనే భారం పడకుండా, బహుళ నాయకత్వ నమూనాను అమలు చేయాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది.ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ బీసీ నేపథ్యం నుంచి వచ్చినవారు కావడం ఈ నిర్ణయానికి మూలకారణం. ఒక వర్గం మాత్రమే ఆధిపత్యం చెలాయించకుండా, ఇతర సామాజిక వర్గాల నుంచి ప్రతినిధులను తీసుకురావాలనే స్పష్టమైన ఆలోచన ఉంది. దీని ద్వారా పార్టీ లోపలి అసంతృప్తిని తగ్గించి, విస్తృత సామాజిక ఆధారాన్ని బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అనిపిస్తోంది.సామాజికవర్గాల వారీగా సముత్యం పాటిస్తు నలుగురిని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఇక ఆమోదముద్రే తరువాయి అని తెలుస్తోంది. ఎంపిక చేసిన నలుగురు పేర్లను పీసీసీ జాతీయ నాయకత్వానికి పంపినట్లు సమాచారం. ఎంపిక చేసినవారిలో ఎస్సీ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ వర్గం నుంచి బలరాం నాయక్, మైనారిటీ వర్గం నుంచి అజ్మతుల్లా లేదా ఒబైదుల్లా, ఓసీ వర్గం నుంచి రోహిన్ రెడ్డి లేదా పద్మావతి రెడ్డికి అవకాశం దక్కనుంది.వర్కింగ్ ప్రెసిడెంట్లతోపాటు ప్రచార కమిటీ ఛైర్మన్ పదవి కూడా చర్చనీయాంశమైంది. ఈ పదవికి జగ్గారెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. ప్రచార వ్యూహాలు, సందేశాల రూపకల్పనలో అనుభవం ఉన్న నాయకులను ముందుంచడం పార్టీ ప్రచార యంత్రాంగాన్ని బలోపేతం చేసే ప్రయత్నంగా చూడవచ్చు.నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం టీపీసీసీని మరింత వికేంద్రీకృతంగా మార్చగలదు. ఒకే వ్యక్తి నిర్ణయాలపై ఆధారపడకుండా, వివిధ వర్గాలు, ప్రాంతాలు, సమస్యలపై సమాంతరంగా పని చేసే అవకాశం ఏర్పడుతుంది. అయితే, ఇలాంటి బహుళ నాయకత్వ నమూనా విజయవంతం కావాలంటే స్పష్టమైన బాధ్యతల పంపిణీ, సమన్వయం అవసరం. లేకపోతే అంతర్గత పోటీలు, సంకేతాల గందరగోళం ఏర్పడే అవకాశం కూడా ఉంది.తెలంగాణలో కాంగ్రెస్ తన సామాజిక ఆధారాన్ని విస్తృతం చేసుకోవాలని, అంతర్గత సమతుల్యతను కాపాడుకోవాలని టీపీసీసీ చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. తదుపరి నిర్ణయాలు ఎలా ఉంటాయో, ఎవరు కచ్చితంగా ఎంపిక అవుతారో చూడాలి.

## ఆగని గిరిపుత్రుల డోలీ కష్టాలు

విశాఖపట్నం డోలి కష్టాలనుంచి రక్షించాలని గిరిపుత్రులు ఐదు కిలో మీటర్ల నడక నిరసన చేసారు. జాజులు బండ, పిత్రిగడ్డ, నీలు బండ, పెద్దగరువు గ్రామాల ప్రజలు ఈ నిరసన కొనసాగింది. సమీప ఆసుపత్రికి 20 కిలోమీటర్లు, ఓటు వేయడానికి 30 కిలో మీటర్లు నడవాల్సి వస్తోంది,. గర్భిణీల కష్టాలు ఇంతంత కాదని వారు అంటున్నారు.

# అనంతగిరి అదవుల్లో ఎకోటూరిజం అభివృద్ధి చేయాలి

(హెచ్.ప్రతాప్)

హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న అనంతగిరి అడవులు తెలంగాణకు ప్రకృతి ప్రసాదించిన అపురూప సంపద. పచ్చని కొండలు, దట్టమైన వృక్ష సంపద, ఆహ్లాదకరమైన వాతావరణం, వన్యజీవులు, పక్షిజాలం, ట్రెక్కింగ్‌కు అనువైన ప్రాంతాలు అనంతగిరికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నగర జీవన ఒత్తిడికి దూరంగా ప్రకృతిని ఆస్వాదించాలనుకునే వారికి ఇది ఎంతో అనువైన ప్రాంతం. అయితే ఇంతటి సహజ సంపదను కేవలం విహార ప్రాంతంగా పరిమితం చేయకుండా, శాస్త్రీయంగా, పర్యావరణహితంగా, స్థానికులకు ఉపాధి కల్పించేలా, ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అనంతగిరిలో సమగ్ర ఎకో టూరిజం ప్రాజెక్టును తక్షణమే అమలు చేయడం సముచితం.

ఎకో టూరిజం అంటే అడవుల్లో భారీ నిర్మాణాలు చేపట్టి వాణిజ్యపరమైన రిసార్టులు ఏర్పాటు చేయడం కాదు. ప్రకృతిని కాపాడుతూ, పరిమిత నిర్మాణాలతో, స్థానిక సమాజాన్ని భాగస్వామ్యం చేస్తూ, పర్యాటకులకు ప్రకృతితో మమేకమయ్యే అనుభూతిని అందించడం దీని ప్రధాన ఉద్దేశం. అనంతగిరిలో పర్యావరణహిత కాటేజీలు, చిన్న లాడ్జులు, నేచర్ ట్రెయిల్స్, బర్డ్ వాచింగ్ కేంద్రాలు, ట్రెక్కింగ్ మార్గాలు, సైక్లింగ్ మార్గాలు, నియంత్రిత క్యాంపింగ్ సౌకర్యాలు, ప్రకృతి వివరణ కేంద్రాలు, స్థానిక ఆహార కేంద్రాలు వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేయవచ్చు.

ఈ విషయంలో కర్ణాటకకు చెందిన జంగిల్ లాడ్జెస్ అండ్ రిసార్ట్స్ (జేఎల్ఆర్) ఒక విజయవంతమైన నమూనాగా నిలుస్తోంది. కబిని వంటి ప్రాంతాల్లో ప్రకృతి, వన్యప్రాణులు, పర్యాటక వసతి, స్థానిక ఉపాధిని సమన్వయం చేస్తూ జేఎల్ఆర్ అభివృద్ధి చేసిన నమూనా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అడవిని నాశనం చేయకుండా, దాని సహజ సౌందర్యాన్నే ప్రధాన ఆకర్షణగా మలచడం ఈ నమూనాలోని ప్రత్యేకత. జంగిల్ లాడ్జెస్ అండ్ రిసార్ట్స్

కర్ణాటక నమూనా నుంచి తెలంగాణ నేర్చుకోవాల్సిన ముఖ్యమైన అంశం ఎకో టూరిజం ద్వారా ఆదాయ సృష్టి. వసతి సౌకర్యాలు, సఫారీలు, గైడెడ్ నేచర్ వాక్స్, ట్రెక్కింగ్ ఫీజులు, క్యాంపింగ్, స్థానిక ఆహార కేంద్రాలు, వాహన సేవలు, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు, స్థానిక ఉత్పత్తులు, హస్తకళల విక్రయాలు వంటి అనేక కార్యకలాపాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చవచ్చు. పర్యాటకుల సంఖ్య పెరిగే కొద్దీ ఈ సేవలకు డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా ప్రభుత్వం, స్థానిక సంస్థలు, స్థానిక వ్యాపార వర్గాలకు కూడా ఆదాయ అవకాశాలు విస్తరిస్తాయి.

అదే సమయంలో అనంతగిరి చుట్టుపక్కల గ్రామాల యువతకు నేచర్ గైడ్‌లు, డ్రైవర్లు, హాస్పిటాలిటీ సిబ్బంది, క్యాంపింగ్ నిర్వాహకులు, భద్రతా సిబ్బంది, నిర్వహణ సిబ్బంది వంటి అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయి. స్థానికంగా ఉత్పత్తి చేసే ఆహార పదార్థాలు, హస్తకళలు, ఇతర సంప్రదాయ ఉత్పత్తులకు మార్కెట్ ఏర్పడుతుంది. ఈ విధంగా ఎకో టూరిజం కేవలం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చే సాధనంగా మారుతుంది.

ప్రభుత్వానికి కూడా ఇది ఒక ముఖ్యమైన ఆదాయ వనరుగా మారగలదు. ప్రవేశ రుసుములు, వసతి, సఫారీలు, క్యాంపింగ్, గైడ్ సేవలు, ఇతర పర్యాటక సౌకర్యాల ద్వారా ప్రత్యక్ష ఆదాయం లభించవచ్చు. పర్యాటక కార్యకలాపాలు పెరగడం ద్వారా రవాణా, ఆహారం, స్థానిక ఉత్పత్తులు, హస్తకళలు వంటి అనుబంధ రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగి పరోక్ష ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఎకో టూరిజాన్ని వ్యయంతో కూడిన పర్యాటక ప్రాజెక్టుగా కాకుండా, దీర్ఘకాలిక ఆదాయాన్ని సృష్టించే పెట్టుబడిగా చూడాలి.

అయితే అభివృద్ధి పేరుతో అనంతగిరి అడవుల సహజ స్వరూపానికి ఎలాంటి నష్టం జరగకూడదు. నిర్మాణాలపై కఠిన పరిమితులు, ప్లాస్టిక్ నియంత్రణ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, నీటి సంరక్షణ, వాహనాల నియంత్రణ, పర్యాటకుల సంఖ్యపై తగిన పరిమితులు, అటవీ జీవవైవిధ్య పరిరక్షణ వంటి చర్యలు తప్పనిసరిగా ఉండాలి. ప్రకృతి పరిరక్షణే ఎకో టూరిజానికి పునాది కావాలి.

కర్ణాటకలో విజయవంతమైన జంగిల్ లాడ్జెస్ అండ్ రిసార్ట్స్ (జేఎల్ఆర్) నమూనాను సమగ్రంగా అధ్యయనం చేసి, తెలంగాణ భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, అటవీ సంపద, స్థానిక సమాజ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక అనంతగిరి ఎకో టూరిజం నమూనాను రూపొందించాలి. ఇందుకు ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యం, అటవీ శాఖ--పర్యాటక శాఖల సమన్వయం, స్థానిక సంస్థల భాగస్వామ్యాన్ని వినియోగించుకోవచ్చు.

అనంతగిరి ఎకో టూరిజం ప్రాజెక్టును ఇక ఆలస్యం చేయకుండా తక్షణ ప్రాధాన్యంతో చేపట్టాల్సిన అవసరం ఉంది. పెరుగుతున్న పర్యాటక డిమాండ్‌ను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుంటే అనంతగిరి తెలంగాణలో ప్రముఖ ఎకో టూరిజం గమ్యస్థానంగా మాత్రమే కాకుండా, ప్రభుత్వానికి స్థిరమైన ఆదాయం, స్థానిక యువతకు ఉపాధి, గ్రామీణ ప్రాంతాలకు ఆర్థికాభివృద్ధి, అడవులకు రక్షణ అందించే ఆదర్శ నమూనాగా ఎదగగలదు. అనంతగిరిని మరో వాణిజ్య రిసార్ట్ ప్రాంతంగా మార్చడం కాదు; ప్రకృతిని కాపాడుతూ, దాని విలువను పెంచుతూ, తెలంగాణకు ఆదాయం--స్థానికులకు ఉపాధి--అడవులకు రక్షణ అందించే ఆదర్శ ఎకో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం కావాలి.

# జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ ఆధ్వర్యంలో 12 గంటలపాటు అన్నమయ్య సంకీర్తనలు




హైద్రాబాద్ ఆగస్ట్ 10; అన్నమయ్య సంకీర్తనలు 12 గంటలపాటు నిర్విరామంగా ఈ రోజు నగరంలోని త్యాగరాయ గానసభ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. మధురమి మ్యూజికల్ ఈవెంట్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డు మరియు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ ఆధ్వర్యంలో 12 గంటలపాటు అన్నమయ్య ప్రసిద్ధ సంకీర్తనలు ఘనంగా జరిగాయి. అన్నమయ్య పాటలు లోని ముఖ్యమైన ప్రజారంజకమైన మొత్తం 111 పాటలను శ్రీమతి కొణిదెల రాధ మరియు శ్రీమతి పింగళి అరుణ లు కలసి అత్యద్భుతంగా ఆలపించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాటలాడుతూ భక్తి పారవశ్యంలో తో పాడిన వారిని నందించారు. పాతతరం కలలను, సాహిత్యాన్ని ప్రస్తుత తరానికి అందించడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమలో శ్రీమతి సంయుక్త,జీనియస్ ప్రతినిధ బింగి నరేంద్ర గౌడ్, సత్యం,కృష్ణ మూర్తి గారు తదితరులు పాల్గొన్నారు.




# అసోంలో మృతుల సంఖ్య 100కు చేరిక

గువహటీ అసోంలో కొనసాగుతున్న వరదలతో మృతుల సంఖ్య 100కు చేరింది. సివసాగర్లో ఒక మరణాన్ని పొరపాటున రెండుసార్లు నమోదు చేయడంతో ఆ జిల్లా మృతుల సంఖ్యను 50 నుంచి 49కి సవరించారు. కచార్లో 22, కరీంగంజ్లో 9, గోలాఘాట్లో 8 మంది మృతి చెందారు. వరదలతో జోర్హాట్ జిల్లాలో 304 గ్రామాల్లో 1.66 లక్షల మంది ప్రభావితమయ్యారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# శ్రీ గోకులం యాదవ సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక



హైద్రాబాద్ ఆగస్ట్ 10;శ్రీ గోకులం యాదవ సంఘం బోడుప్పల్ - చెంగిచెర్ల, ఏకగ్రీవంగా యాదవ సంఘం ఎన్నికైంది.గౌరవ అధ్యక్షులు మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ , మాజీ కార్పొరేటర్ రసాల వెంకటేష్ యాదవ్ , వ్యవస్థపాక అధ్యక్షుడు ముడేతుల మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సటు నరేష్ యాదవ్, ఉపాధ్యక్షులు తోకల కిషోర్ యాదవ్, గద్ద తిరుపతి యాదవ్, కోశాధికారి బోల ముకేష్ యాదవ్, ముఖ్య సలహా దారులుగా సటూ చిన్న బాలయ్య యాదవ్, బాల నరసింహ యాదవ్, ఎల్లుపుల మధునయ్య, సటు బంగారు యాదవ్, వల్లే నరసింహ యాదవ్,జెయింట్ సెక్రటరీ గా సరోజి శ్రీనివాస్ యాదవ్, బక్కతట్ల శంకర్ యాదవ్, వలపు రాజు యాదవ్,వెంకటస్వామి యాదవ్, ఆర్గనైజర్ :కడారీ నర్సింహ యాదవ్, గొడుగు రమేష్ యాదవ్, ఇనగంటి రవి యాదవ్, చేరా బోయిన చంద్రశేఖర్ యాదవ్, కడారీ శేఖర్ యాదవ్, భాగం శేఖర్ యాదవ్. వివిధ యాదవ సభ్యులు పల్గోన్నారు.

# విజయవంతంగా ముగిసిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విజన్ 2034 ఏకో వర్క్ షాప్




హైద్రాబాద్ ఆగస్ట్ 10;తెలంగాణ రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో విజన్ 2034 ఏకో వర్క్ షాప్ భవిష్యత్ కోసం వ్యూహాత్మక ప్రణాళిక పై రెండు రోజులపాటు రాష్ట్ర ట్రైనింగ్ సెంటర్, జీడిమెట్లలో జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సోమనాథ్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి ఉద్దేశించి ముఖ్యంగా ఈ ప్రోగ్రామ్ ప్రధానంగా కార్య చరణ ప్రణాళికను రూపొందించుకోవడం తో పాటు భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ,సభ్యుల సంఖ్యను , యూనిట్ లను పెంచుకోవడం,నాయకత్వాన్ని పెంపొందించుకోవడం,నిర్దేశించుకున్న లక్ష్యాలను రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయిలకు విది విధానాలనూ రూపోశీదించుకోవడం కోసం ఈ పది సంహత్సరముల్లో సంస్థను బలోపేతం చేయడానికి , రూపొందించిన ముఖ్యమైన కార్యక్రమమని , జాతీయ హెడ్ క్వార్టర్ నుండి ప్రత్యేక ఆహ్వానం, విజ్ఞప్తి మేరకు విచ్చేసిన రిసోర్స్ పర్సన్ డాక్టర్ బి. రమేష్ పట్నాయక్ పర్యవేక్షణలో, డాక్టర్ D R K శర్మ ముఖ్య సలహాలతో ఈ కార్యక్రమమును నిర్వహించడం జరుగుతుందని వారికి ప్రత్యేక హృదయాభి వందనములు తెలియ చేశారు,



ఈ సందర్భంగా రాష్ట్ర BSG ఇచ్చిన పిలుపుతో అన్ని జిల్లా ల నుండి వచ్చిన స్కౌట్ మాస్టర్ అండ్ గైడ్ కెప్టెన్ జిల్లా ముఖ్య నిర్వాహక సభ్యులందరికీ ప్రత్యేకంగా అభినందించారు ,

ఈ కార్యక్రమానికి వారితోపాటు రాష్ట్ర ఆర్గనైజర్ కమిషనర్ స్కౌట్స్ ం.పరమేశ్వర్ , డాక్టర్ ప్రమోదినీ , +. వెంకట్ రెడ్డి, జాన్ శ్యామ్యుల్ గారు,రామ్ మోహన్ ,అమర జ్యోతి వెంకటేశ్వర్లు , సాయి నిరంజన్ , సాంకేతిక నిపుణులు గ్రీష్మ చంద్రికా, ప్రవీణ్ లు విచ్చేశారు,మన హైద్రాబాద్ జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ తరుపున మన వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హమీద్ ,సెక్రటరీ వి. లక్ష్మణ్ నాయక్ , డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కమిషనర్, యన్. కరుణాకర్ , జిల్లా స్కౌట్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ వి. రాములు నాయక్ గారు, గైడ్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.అనితా గారు , జిల్లా కమిషనర్ వి. హేమలత , అకౌంట్ సెక్షన్ మమత, ఈ కార్యక్రమానికి హాజరయ్యారు , ఈ సందర్భంగా హైద్రాబాద్ జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఈ అవకాశము కల్పించినందుకు, రాష్ట్ర ట్రెజరీ రాజగోపాల్ సార్ గారికి ,రాష్ట్ర చీఫ్ కమిషనర్ దాన కిశోర్, మరియు రాష్ట్ర BSG డైనమిక్ సెక్రటరీ అయినా డాక్టర్ నవీన్ నికోలస్ సార్ గారికి హైద్రాబాద్ జిల్లా పక్షాన హృదయపూర్వక అభినందనలు తెలియచేశారు. భవిష్యత్ లో హైద్రాబాద్ జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను అధికారుల సహకారముతో వేగవంతముగా నిర్వహించుకుంటామని , ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మరియు చీఫ్ కమిషనర్ అయినా యాదయ్య గారికీ ప్రత్యేక హృదయభి వందనములు తెలియ చేస్తూ కృతజ్ఞతలు తెలియ చేశారు.వారి సహకారం తో జిల్లా లో నీ ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాల ఉపాధ్యాయులు అనేకమంది కొత్తగా ట్రైనింగ్ తీసుకోవడం జరిగింది,

ఉపవిధ్యాధికారి బండ్లగూడ మండలం బి.వెంకటేశ్వర్లు జిల్లా కమిషనర్ స్కౌట్ గారికి ఈ సందర్భంగా ధన్యవాదములు తెలిపారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ట్రాఫిక్ ఆలఖ కుమార్తె మృతి!

విజయవాడ, ఆగస్ట్ 10: గుంటూరు జిల్లాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం కుమార్తె హాఫీసా బేగం (24) మృతి చెందారు. ఆమెతో పాటు కారులో తాడేపల్లికి చెందిన ఉండి రుత్విక్ (జిమ్ నిర్వాహకుడు), అవినాష్, సుధీర్, షేక్ ఆసిఫా, వంశీ స్నేహితులు ప్రయాణిస్తున్నారు. వీరిలో ఒకరు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపిన వివరాల ప్రకారం..హాఫీసా బేగం తన స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు ముందు వెళ్తున్న లారీ సడెన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీ కొట్టి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను తాకి ఆగిపోయింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి వచ్చి క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆసిఫా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం క్షతగాత్రుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు గుంటూరు ఎస్పీ తెలిపారుఇదిలా ఉండగా.. విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. చికిత్స అనంతరం కోలుకుని తిరిగి విధుల్లో చేరారు. ఆమె విజయవాడ ట్రాఫిక్ డీసీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో కుమార్తె హాఫీసా బేగం మృతి చెందిన విషాద వార్త కుటుంబ సభ్యులు, సహచరులను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనతో పోలీసు వర్గాల్లో విషాదం నెలకొంది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, లారీని కారు ఢీకొన్న కారణాలపై నల్లపాడు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# చెత్త సేకరణ రిక్షాలు.. స్క్రాప్ దుకాణాలకు!

## లక్షలాది ప్రజాధనం బూడిదపాలు.. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

## జహీరాబాద్ నియోజకవర్గంలో పంచాయతీ, మున్సిపల్ వ్యవస్థ తీరు

**జహీరాబాద్, ఆగస్టు 10 ప్రజాబలం ప్రతినిధి:**ప్రజల నుంచి చెత్త సేకరించి పరిశుభ్రతను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి సమకూర్చిన చెత్త సేకరణ రిక్షాలు ఇప్పుడు స్క్రాప్ దుకాణాలకు చేరుతున్నాయనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రజల అవసరాల కోసం



కొనుగోలు చేసిన రిక్షాలను సక్రమంగా వినియోగించకుండా పాత సామగ్రి దుకాణాలకు తరలించడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఇంటింటికీ చెత్త సేకరణ కోసం ప్రభుత్వం పెద్దఎత్తున రిక్షాలను అందించింది. అయితే వాటిలో కొన్నింటిని వినియోగించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో తుప్పుపట్టి



పనికిరాకుండా పోయాయని స్థానికులు చెబుతున్నారు. ఇంతటితో ఆగకుండా తుప్పుపట్టిన పాత రిక్షాలతో పాటు కొత్తగా ఉన్న చెత్త సేకరణ రిక్షాలను సైతం స్క్రాప్ దుకాణాలకు తరలించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాధనం.. స్క్రాప్ పాలా?

ప్రజల నుంచి చెత్త సేకరణ, పరిశుభ్రత నిర్వహణ కోసం ఉపయోగించాల్సిన



వాహనాలు పాత సామగ్రి దుకాణాలకు చేరడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు తలెత్తిస్తోంది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన రిక్షాలను ఎందుకు వినియోగించలేదు? వాటిని స్క్రాప్‌కు తరలించాల్సిన అవసరం ఏమొచ్చింది? కొత్తగా ఉన్న రిక్షాలను ఏ నిబంధనల ప్రకారం తొలగించారు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రిక్షాలు ఎక్కడికి వెళ్లాయి?

నియోజకవర్గంలోని ఆయా గ్రామపంచాయతీలు, మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణ కోసం గతంలో కొనుగోలు చేసిన రిక్షాల సంఖ్య ఎంత? ప్రస్తుతం ఎన్ని వినియోగంలో ఉన్నాయి? ఎన్ని పాడైపోయాయి? ఎన్ని స్క్రాప్‌కు తరలించారు? స్క్రాప్‌కు తరలించిన రిక్షాలను ఏ ధరకు విక్రయించారు? వాటి విక్రయానికి సంబంధించి వేలం నిర్వహించారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

ప్రజల పన్నుల రూపంలో సమకూరిన నిధులతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ఆస్తులను నిర్లక్ష్యంగా స్క్రాప్‌కు తరలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొత్త రిక్షాలు కూడా స్క్రాప్ దుకాణాలకు చేరినట్లయితే దీనిపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరుతున్నారు. ప్రజాధనానికి నష్టం కలిగించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ ...

## స్వగృహంపై జాతీయ జెండా ఎగరవేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం




కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సోమవారం రోజున 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రోగ్రాం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తన స్వగృహంపై కుటుంబ సభ్యుల తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూమన జాతీయ పతాకం దేశానికి , మనందరికీ గర్వకారణమని, దేశభక్తిని కలిగే విధంగా నిరంతర ప్రేరణ శక్తిని ఇస్తుందని తెలిపారు. 2022 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు 15స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి, 'వికసిత భారత్' నిర్మాణానికి మద్దతుగా నిలిచి, మనందరి ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తమిళనాడులో ఇకపై మొదట రాష్ట్ర గీతం 'తమిళ తాయ్ వాళ్తు'నే ఆలపించాలి

చెన్నై, ఆగస్టు 10 తమిళనాడులోని అన్ని అధికారిక కార్యక్రమాల్లో ఇకపై రాష్ట్ర గీతం 'తమిళ తాయ్ వాళ్తు'కే ప్రథమ ప్రాధాన్యం లభించనుంది. కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ సోమవారం తమిళనాడు శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. రాష్ట్రంలోని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఈ నిబంధన వర్తిస్తుంది.ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు దీనికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ వాయిస్ ఓటు ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, తమిళ భాష తమ రాష్ట్రానికి ప్రాణనాడి, భావోద్వేగం, అస్తిత్వమని అభివర్ణించారు. "తమిళం మన గర్వం, తమిళం మన శక్తి. 'తమిళం' అన్న పదం యావత్ తమిళనాడును ఏకతాటిపైకి తెస్తుంది. తమిళ తాయ్ వాళ్తుకు రాష్ట్రంలో ప్రథమ స్థానం ఉండాలి, దానికి అగ్రపీఠం వేయడం మా హక్కు" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర భాషా, సాంస్కృతిక హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, తమిళ భాషాభిమానం దేశభక్తి పరస్పర విరుద్ధం కావని ఆయన పేర్కొన్నారు.అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతానికి ముందు జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇటీవల ఒక సూచన చేసింది. రాష్ట్ర గీతంతో పాటు జాతీయ గీతం లేదా గేయం ఆలపించాల్సి వస్తే, జాతీయ గేయానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

# పెద్దమ్మ తల్లి పోచమ్మ తల్లి బోనాల పండుగలో పాల్గొన్న నీలి వెంకట్ రామ్ కుటుంబం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా;** మర్పల్లి మండలం మర్పల్లి పోచమ్మ తల్లి పెద్దమ్మ తల్లి బోనాల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న నీలి వెంకట్ రామ్ కుటుంబం మర్పల్లి అమ్మవారి బోనాల పండుగలో వేలాది ప్రజలతో కొలువుదీరిన అమ్మవారు కి ఘనంగా అందమైన అలంకారంలతో బోనాలు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నీలి బ్రదర్స్ వెంకట్ రామ్ తెలిపారు అమ్మవారి ఆశీస్సులు మా గ్రామం పైన మా కుటుంబం పైన సదాకాలము వారి చల్లని చూపు దయచేయాలని మనస్ఫూర్తిగా అమ్మవారికి విన్నపము సమర్పించడం జరిగిందని యువ నాయకుడు ప్రముఖ వ్యాపారవేత నీలి శ్రీకాంత్ తెలిపారు

# సిఐటియు ఆధ్వర్యంలో జైలు బరో కార్యక్రమం

## జోగిపేటలో సిఐటియు నాయకుల నిరసన ధర్నా



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** కేంద్ర ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, సిఐటియు డిమాండ్ చేసింది,జోగిపేట పట్టణంలో సిఐటియు, ఆధ్వర్యంలో నిర్వహించిన జైల్ బరో కార్యక్రమంలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు, నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు, జోగిపేట పోలీస్ స్టేషన్కు వారిని



తరలించారు, కార్మికులు జోగిపేట పోలీస్ స్టేషన్లోనే తమ నిరసనను వ్యక్తం చేస్తూ, ఆందోళన చేపట్టారు,కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం, అనుసరిస్తున్న, కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై సిఐటియు ఆగ్రహం వ్యక్తం చేసింది, సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి, సాయిలు పాల్గొని మాట్లాడారు, నిత్యవసర వస్తువులు పెట్రోల్,డీజిల్,గ్యాస్, మరియు



ఎరువుల,ధరలు విపరీతంగా పెంచి, కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై,పెను భారం మోపుతుందని మండిపడ్డారు, రైతులు పండించిన పంటకు, గిట్టుబాటు ధర చెల్లించాలని, ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని, డిమాండ్ చేశారు, కేంద్ర ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోకపోతే రాబోయే రోజుల్లో కార్మికులు రైతుల చేతుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు, ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేసిన సిఐటియు నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు, పోలీస్ స్టేషన్లో బయట ఇంచిన కార్మికులు కాసేపు తమ నిరసన కొనసాగించారు, ఈ కార్యక్రమంలో సిఐటియు అందోల్ డివిజన్ కార్యదర్శి , విద్యాసాగర్, మండల బాధ్యులు సురేష్ కృష్ణ,ప్రభాకర్, యశోద, షేకమ్మ, సత్యం, శివకుమార్,రాములు, సాయిబాబా, దుర్గేష్, మల్లేశం, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు....

# అప్పుల బాధతో డ్రైవర్ ఆత్మహత్య



**జహీరాబాద్, ఆగస్టు 10 ప్రజా బలం ప్రతినిధి:** అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కచేరి తాజోద్దీన్ బాబు మియా (41) డ్రైవర్‌గా పనిచేస్తూ ఫైనాన్స్‌లో రుణం తీసుకుని బొలెరో వాహనం కొనుగోలు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి సోదరుడు మహమ్మద్ గౌసోద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ ఎస్ ఐ లవకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బోనాల జాతరలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ నాయకులు



**గండిపేట మండల ప్రజాబలం ప్రతినిధి 9 ఆగస్టు 2026**తెలంగాణ ప్రాంత ప్రత్యేక పండుగగా బోనాల జాతర జరుపు కొవడం ఆనవాయితీ కాగా, అందులో భాగంగా మణికొండ, నెక్నంపుర్ లలో స్థానికంగా ఉన్న పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, మహంకాళి దేవాలయంలో ఉన్న దేవతలను పూజిస్తారు. ఈ జాతరలో పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇట్టి సందర్భంగా మణికొండ, నెక్నంపుర్లో జరుగుతున్న మహోత్సవములకు భారత రాష్ట్ర సమితి కుటుంబ సభ్యులు ఆదివారం రోజున సామూహికముగా అమ్మవార్లను దర్శించుకుని సకల జనులు పిల్లా పాపలతో ఆయుర్ ఆరోగ్యాలతో సుఖంగా వుండాలని కోరుకోవడం జరిగినది.



# పంచలింగాల్ గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు







**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 10(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో అమ్మవారి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియపరిచిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ యస్ కొండల్ రెడ్డి, మర్పల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సురేష్ యాదవ్, ఉప సర్పంచ్ ముత్యాల ఆంజనేయులు గౌడ్ తెలిపారు అమ్మవారి బోనాల పండుగ లో పెద్దలు నాయకులు అధికారులు గ్రామ ప్రజలు అన్నలు అక్కలు చిన్నలు పెద్దలు అందరూ పండగ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి బోనాల సంబరాలు సంతోషంగా పాల్గొనాలని తెలిపారు ప్రతి ఒక్కరు దైవచింత కలిగి ఉండాలి భయభక్తులతో ప్రేమానురాగాలతో సంతోషంగా గ్రామ ప్రజలు అందరూపండుగలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అష్ట ఐశ్వర్యాలు ఆయురారోగ్యాలు మన గ్రామ ప్రజల పైన సద కాలం దయచేయాలని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సురేష్ యాదవ్, ఉప సర్పంచ్ ముత్యాల ఆంజనేయులు గౌడ్ గ్రామ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియపరిచారు

# ఆదివాసీ సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేయాలి

## కొమరం భీమ్ స్ఫూర్తితో హక్కుల సాధనకు ముందుకు సాగాలి

## రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క









**చంద్రుగొండ/ అశ్వరావుపేట ఆగస్టు 9 ప్రజాబలం ప్రతినిధి** :-ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు రింగ్ రోడ్ సెంటర్లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)లి చేతుల మీదుగా కొమరం భీమ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు

జిల్లా కలెక్టర్ అంకిత్ స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజానికి ప్రత్యేకమైన జీవన విధానం సంస్కృతి సంప్రదాయాలు దేశానికి గొప్ప వారసత్వమని పేర్కొన్నారు

అడవిని తల్లిగా భావించి ప్రకృతితో మమేకమై జీవించే ఆదివాసీల జీవన విధానం ఎంతో విశిష్టమైనదని అన్నారు అడవులు కొండలు వాగులు వనరులను కాపాడటంలో ఆదివాసీల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు

ప్రకృతిని కాపాడుతూ తమ సంస్కృతిని తరతరాలకు అందిస్తున్న ఆదివాసీ సమాజాన్ని అభినందించారు

ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన కొమరం భీమ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు

జల్ జంగల్ జమీన్ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు

ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు ప్రతి కుటుంబం తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని కోరారు ఉన్నత విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని తెలిపారు

విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపై యువత దృష్టి పెట్టాలని సూచించారు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ విద్యా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు

ఆదివాసీ యువత పోటీ పరీక్షలకు సిద్ధమై ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు

మహిళలు విద్య ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఆదివాసీ మహిళలలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారుస్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడాలని సూచించారు ఆరోగ్యంపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు

పిల్లలకు పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు మూఢనమ్మకాలకు దూరంగా ఉండి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చని అన్నారు తమకు ఉన్న హక్కులు ప్రభుత్వ పథకాల గురించి ప్రతి కుటుంబం తెలుసుకోవాలని సూచించారు భూమి అటవీ హక్కులు ఉపాధి విద్య ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారుఆదివాసీ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని పేర్కొన్నారు రోడ్లు తాగునీరు విద్యుత్ విద్య వైద్యం వంటి సౌకర్యాలు ప్రతి గ్రామానికి అందేలా ప్రతి ఒక్కరూ మరింత కృషి చేయాలని పేర్కొన్నారుఅభివృద్ధి పేరుతో ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారుఆదివాసీ భాషలు కళలు నృత్యాలు జానపద సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు

తమ సంస్కృతిని గౌరవించడంతో పాటు ఆధునిక సమాజంతో పోటీపడేలా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు

ప్రకృతి సంపదను కాపాడుతూ జీవనోపాధిని మెరుగుపరుచుకునే మార్గాలను అన్వేషించాలని తెలిపారు అటవీ ఉత్పత్తులకు వినియోగించుకుంటూ

యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ సమాజం తమ హక్కుల కోసం చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

చైతన్యం, విద్య, ఐక్యతతోనే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు

ప్రతి ఆదివాసీ కుటుంబం ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా బలోపేతం కావాలన్నారుఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి పనిచేస్తారని తెలిపారుఆదివాసీ దినోత్సవం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా అభివృద్ధికి మార్గదర్శకంగా ఉండాలని అన్నారు ప్రతి ఆదివాసీ కుటుంబంలో విద్య తో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు

ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూనే ఆధునిక అభివృద్ధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు

కొమరం భీమ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అదేవిధంగాఆదివాసీ సమాజం ఐక్యతతో ముందుకు సాగి అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని ప్రముఖులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఆదివాసీ ప్రజల్లో చైతన్యం నింపడంతో పాటు విద్య ఆరోగ్యం ఉపాధి హక్కులపై కొత్త ఆలోచనలకు నాంది పలకాలి..

# అలర్ట్.''సర్ "కు నేడు ఒక్కరోజే ఛాన్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :తెలంగాణ,రాష్ట్రలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు గడువు ఆగస్టు 10వ,తేదీతో ముగియనుంది,ఈ గడువును పొడిగించే అవకాశం లేదని అధికార వర్గాలు స్పష్టం చేశాయి, ఇంకా ఫారాలు పూర్తి చేయనివారు వెంటనే స్థానిక బూత్ లెవల్ అధికారులను ( బి ఎల్ ఓ ) సంప్రదించి వివరాలు అందించాలని ఎన్నికల సంఘం సూచించింది, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని కోరింది.....

# తెలంగాణలో రానున్న రెండు రోజులు వర్షాలు.

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**తెలంగాణలో రానున్న రెండు రోజులు వర్షాలు,బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం వల్ల తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ( ఐ ఎం డి ) తెలిపింది.రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్,నిజామాబాద్, సంగారెడ్డి, ఖమ్మంతో, పాటు హైదరాబాద్ పరిసర జిల్లాల్లో సాయంత్రం వేళల్లో వానలు పడవచ్చని అంచనా వేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులుసూచిస్తున్నారు...



## శ్రీ జయ దుర్గా మైసమ్మ దేవాలయంలో ఘనంగా ముగిసిన బోనాల పండుగ జాతర.. దర్శించిన పీఏసీ చైర్మన్ గాంధీతో పాటు వారి సతీమణి శ్యామలాదేవి



లు పొందిన భక్తులందరికీ మా హృదయ పూర్వక కృతజ్ఞతలు.బోనాల పండుగ ఏర్పాట్లలో ప్రత్యక్షంగా,పరోక్షంగా స హక రించిన దేవాదాయ శాఖ అధికారు లు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భజంత్రీలు, పలు రకాలుగా సహ కరించిన దాతలు, సేవకులు,పోలీస్ జిహెచ్ఎంసి, ఇతర శాఖల సిబ్బంది, అలాగే కార్యక్రమం విజయవం తం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు.ము



**శేర్లింగంపల్లి ( ప్రజాబలం ప్రతినిధి ) ఆగస్టు 9** శ్రీ జయ దుర్గా మైసమ్మ దేవాలయం, హైదర్ నగర్ లో ఈరోజు,ఆదివారం బోనాల పండుగ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అభిషే కాలు నిర్వహించడంతో పాటు భక్తులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.ఈ ఏడాది బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి విశేష అలంకరణ,మండపం లో వృత్తాకారంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణ, వివిధ రకాల పుష్పా లతో రూపొందించిన అమ్మవారి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పుష్పా లతో సుందరంగా తీర్చిదిద్దిన అమ్మవారి ప్రతిమ భక్తులను విశేషంగా ఆక ట్టుకుంది.ఈ సందర్భంగా గౌరవ శాసన సభ్యులు మరియు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ శ్రీ అరెకపూడి గాంధీ,
వారి సతీమణితో కలిసి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అలాగే మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు
కూ డా దేవాలయాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.
బోనాల పండుగ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయానికి తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీయుత కమిషనర్, దేవాదాయ శాఖ ఆదేశాలు అనుసరించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ఆలయ అధికారులు,అర్చకు
లు, సిబ్బంది, భజంత్రీలు, సేవకులు, పోలీస్, జిహెచ్ఎంసి, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు....
కృతజ్ఞతాభివందనం
శ్రీ జయ దుర్గా మైసమ్మ దేవాలయంలో ఈరోజు నిర్వహించిన బోనాల పండుగ మహోత్సవం అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించబడింది.ఈ పవిత్ర కార్య క్రమానికి విచ్చేసి అమ్మవారి ఆశీస్సు ఖ్యంగా అమ్మవారిపై భక్తి విశ్వాసాలతో బోనా లు సమర్పించి, కార్యక్రమాన్ని విజయ వంతం చేసిన భక్తజనులకు,మహిళల కు, యువతకు మరియు స్థానిక ప్రజలకు మా హృదయపూర్వక అభినం దనలు.అందరి సమిష్టి సహకారం, సమన్వయం మరియు భక్తిశ్రద్ధల వల్లే
ఈ బోనాల పండుగ ఇంత ఘనంగా విజయవంత మైంది.అందరికీ శ్రీ జయ దుర్గా మైసమ్మ అమ్మవారి కృపాకటా క్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూ ర్తిగా కోరుకుంటు న్నాము.ఓం శ్రీ జయదుర్గా మైసమ్మ తల్లికి.పి. సతీష్ బాబు,కార్యనిర్వహణాధికారి సైతం విధి నిర్వహణలో ఉన్నారు.

## లేబర్ కోడ్లు, వి.బి.జి. రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి
## జహీరాబాద్‌లో జైల్‌భరో.. నాయకుల అరెస్ట్



**జహీరాబాద్, ఆగస్టు 10 ప్రజాబలం ప్రతినిధి:** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు, ఉపాధి హామీ చట్టానికి బదులుగా తీసుకొచ్చిన వి.బి.జి. రాంజీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. సీఐటీయూ, ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జహీరాబాద్ శ్రామిక భవన్ నుంచి జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన నిర్వహించి బస్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. అనంతరం జైల్‌భరో కార్యక్రమంలో నిరసన చేపట్టగా నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను కేంద్రం ఉపసంహరించుకోకపోతే క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మహిపాల్ హెచ్చరించారు. కార్యక్రమంలో తుల్జారాం, సుకుమార్, నరేష్, సందీప్‌రెడ్డి, వంశీకృష్ణ, యశోదమ్మ, నందమ్మ, శ్యామల, ఎల్లప్ప, మోహన్, సంజీవ్, లక్ష్మణ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.




## తిమ్మాపూర్ లో సిసి కెమెరాలు ప్రారంభించిన మర్పల్లి సబ్ ఇన్స్పెక్టర్, గ్రామ సర్పంచ్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం తిమ్మాపూర్ గ్రామంలో సిసి కెమెరాలు అమర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మర్పల్లి ఎస్సై రవుఫ్, మరియు గ్రామ సర్పంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని సీసీ కెమెరాలను ప్రారంభోత్సవం చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ వార్డు మెంబర్స్ యువకులు గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు

## తక్షణమే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయండి...రైతు లు పడుతున్న ఇబ్బందులని పట్టించుకోండి..

### రైతు ప్రయోజనాల. దృష్ట్యా రాజకీయలకు అతీతంగా వెంటనే నీటి పంపింగ్ చేయండి...

– వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలంటూ ఉత్తం కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ..

– రిజర్వాయర్ లలో నీటిని సకాలం లో నింపక పోవడం వల్ల పంటల సాగు ముందుకు పోక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్న హరీష్ రావు..

– కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్లు అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్ లను నింపి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి..

– ఒక వైపు ఎలినినో వల్ల తక్కువ వర్షభావం, మరో వైపు ప్రాజెక్టు ల్లో నీళ్లు లేక ఆందోళన లో అన్నదాతలు..

– వానాకాలం పంట సాగు కు సాగు నీరు కోసం ఎదురు చూస్తున్న రైతాంగం..

– ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రిజర్వాయర్ లకు నీటిని పంపింగ్ చేయాలని రైతుల పక్షాన లేఖ ద్వారా డిమాండ్ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారు..

– కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్ లు అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, నృసింహ (బస్వా పూర్ ) రిజర్వాయర్ లను నింపి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా మోటార్లను ఆన్ చేసి వెంటనే నీటి పంపింగ్ చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు రైతు ల పక్షాన లేఖ వ్రాసారు..

– ప్రస్తుత వానాకాలం పంట సీజన్ రైతులు ఇటు ఎలినినో వల్ల తక్కువ వర్షాభావం, అటు ప్రాజెక్టుల్లో రిజర్వాయర్ లలో నీటిని సకాలం లో నింపక పోవడం తద్వారా పంటల సాగు ముందుకు సాగక రైతులు తీవ్ర ఆందోళన లో ఉన్న విషయం లేఖలో పేర్కొన్నారు.. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన వచ్చే వరదను తద్వారా ప్రతి నీటి చుక్కని ఒడిసి పట్టి సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ లను ఆన్ చేసి రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటి పంపింగ్ ప్రారంభించాలని రైతుల పక్షాన డిమాండ్ హరీష్ రావు లేఖ ద్వారా డిమాండ్ చేశారు..

– కాళేశ్వరం ప్రాజెక్టు లో అంతర్భాగం అయిన మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టి ఎం సి లు, ప్రస్తుతం సుమారు 22 టి. ఎం సి ల నీటి లభ్యత ఉందని... అదేరకంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వలన గోదావరి లోని వరద నీటి లభ్యత కూడా ఏర్పడనుందన్నారు... ఇట్టి విషయం దృష్టిలో ఉంచుకొని మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించాలని, తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు లో అంతర్భాగమైన అన్నపూర్ణ (అంతగిరి ), రంగనాయక సాగర్, మల్లన్న సాగర్,కొండపోచమ్మ సాగర్, నృసింహ ( బస్వాపూర్ ) తదితర రిజర్వాయర్ లను, వాటి పరిధిలోని చెరువులను, చెక్ డ్యామ్ ల అన్నింటిని నింపి సుమారు 4లక్షల ఎకరాల కు నీరందించేలా చర్యలు చేపట్టలన్నారు.. రైతు సాగు ప్రయోజనాలు తీర్చడానికి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా నీటి పంపింగ్ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నానని లేఖ ద్వారా చెప్పారు.. – అదేవిదంగా లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ) పూర్తి నీటి సామర్థ్యం 24 టి. ఎం. సి లు, ప్రస్తుత నీటి లభ్యత 6.9 టి ఎం. సి లు ఉన్నాయి. మిడ్ మానేరు నుండి లోయర్ మానేరు (ఎల్ఎండీ) కు నీటిని నింపి ౹ా౽ూా ౹ూ౹ూా+ఙు –2 లోని అవసరమగు ఆయకట్టు కు నీరు అందించి రైతులను అదుకోవాలని విజ్ఞప్తి చేశారు.. – గత యాసంగి పంట లో కాళేశ్వరం ప్రాజెక్టు లోని పై రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4లక్షల ఎకరాలు సాగు అయిన విషయం గుర్తించి ఈ వానాకాలం పంటకి అదేవిదంగా వచ్చే యాసంగి పంటకు కూడ సాగు నీరు అందించేల కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్ నింపి తద్వారా వాటి అనుసంధానం గా నిర్మించిన కాలువ లు, చెరువు లు చెక్ డ్యామ్ ల అన్నింటిని నింపి రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించి రైతు ప్రయోజనాల. దృష్ట్యా రాజకీయలకు అతీతంగా వెంటనే నీటి పంపింగ్ ప్రారంభించేల చర్యలు చేపట్టాలని లేఖలో కోరారు...

## తెలంగాణ బ్రాహ్మణ అస్తిత్వ భూమికగా బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక




**ప్రజాబలం,(హైదరాబాద్):** తెలంగాణ బ్రాహ్మణ అస్తిత్వ భూమికగా ఏర్పడిన తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే తెలంగాణ సమాజానికి విస్తృత సేవలు అందించాలి అనే ఆకాంక్షతో
భారతదేశ చరిత్రలోనే ప్రప్రదమంగా ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 1000 మంది సేవకులతో ఒక మెగా జంబో కమిటీని ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక 8 విభాగాలతో ప్రతి విభాగానికి 125 మంది నాయకులతో చాలా పటిష్టంగా ఏర్పడబోతుంది అని. తెలంగాణ బ్రాహ్మణ ఆధ్యాత్మిక వేదిక, తెలంగాణ బ్రాహ్మణ మేధో మండలి, తెలంగాణ బ్రాహ్మణ మహిళా సాధికారిక వేదిక, తెలంగాణ బ్రాహ్మణ యువ చైతన్య వేదిక, తెలంగాణ బ్రాహ్మణ రాజకీయ వేదిక, తెలంగాణ బ్రాహ్మణ ఎన్నారై సెల్, తెలంగాణ బ్రాహ్మణ సోషల్ మీడియా వారియర్స్ అని వీటన్నిటిని సమన్వయం చేసే వేదికగా తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక ఉంటుంది అని ఎనిమిది విభాగాలు తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదికకి పునాదులుగా ఉంటాయి అని తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక నాయకులు ప్రకటించారు.
తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక ఒకరి క్రింద ఒకరు పని చేసే వ్యవస్థగా కాకుండా తెలంగాణ బ్రాహ్మణులు సబండ వర్గాలతో సమైక్యమై పనిచేసే వ్యవస్థగా ఉంటుందని అందుకని తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదికకి B-Friends అని క్యాప్షన్ పెట్టుకున్నాము అని.
దాని అబ్రివేషںŽB-FRIENDS (Brahman For social Re-engineering Inclusive Empowerment Networks Development System) గా ఉంటుందని తెలియజేశారు.
తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక,తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులందరూ తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ వ్యవహారం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్కి చైర్మన్గా ఉండే వ్యక్తి న్యూట్రల్ గా ఉండాల్సింది పోయి దీూూా అనే ఒక ప్రైవేట్ ఆర్గనైజేషన్ కి చీఫ్ కోఆర్డినేటర్ గా ఉంటూ సంక్షేమ పరిషత్ ఆఫీసులో ప్రైవేటు ప్రెస్మీట్లో పెట్టడం అధికార దుర్వినియోగమని దీనిపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ గారికి ఏమాత్రం కూడా గౌరవనీయకుండా ప్రైవేటు వ్యక్తులతో ప్రెస్ మీట్ పెట్టడం అనేది చాలా దుర్మార్గ చర్యగా అభివర్ణించారు.బాస్ అనే ఫ్యాడలిస్టు పోకడతో తెలంగాణ సమాజానికి దూరం చేస్తున్న వారే అయోధ్య రామాలయం విషయంలో ఎలాంటి పరిపక్వత లేకుండా ప్రెస్ మీట్ పెట్టి హిందూ సమాజానికి కూడా బ్రాహ్మణులను దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారు ఇది ఏమాత్రం తెలంగాణ భూమి పుత్రుడు ఊరుకోరని సనాతన ధర్మం పట్ల అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల పట్ల ఒక్క అడుగు కూడా వెనకకు వేయమని నేటి నుండి సబండ వర్గాలతో సమైక్యమై తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలో నెంబర్ వన్ ఉంచడమే తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక మరియు తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక ఉమ్మడి లక్ష్యమని ప్రకటించారు.
తెలంగాణ సంక్షేమ పరిషత్ బాధ్యులను ప్రకటించి మూడు నెలలు అవుతున్నా కూడా విదేశీ విద్య చదువుకోడానికి వెళ్లిన విద్యార్థులకు సరైన న్యాయం జరగడం లేదు అని వెంటనే వారిని ప్రభుత్వం పెద్ద మనసుతో ఆదుకోవాలని కోరుకున్నారు.
అలాగే పేద బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అలాగే హెల్త్ కార్డు విషయంలో మిగతా ప్రభుత్వ సంక్షేమ ఫలాల విషయంలో ప్రాతినిధ్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరారు.ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారులకు సరైన ప్రాతినిధ్యమిచ్చి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్త్ నియామకాలు కేవలం తెలంగాణ భూమి మిత్రులతోనే తప్పకుండా జరగాలని దీనితోపాటు మిగతా నామినేటెడ్ పోస్టులలో వారికి సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ, పోచంపల్లి రమణారావు ,అక్కినేవల్లి,వేణుగోపాలరావు,గంవ రామారావు, ఊర ప్రసాదరావు,
గూడ రాజేశ్వరరావు,చకిలం నరసింహారావు,సావల్కర్ శ్రీధర్ రావు,నరసాపురం రవి కిరణ్,
వింజమూరు మనోహర్రావు,
గూడ జయరాం,చెన్నూరి లక్ష్మీ నరసింహారావు పాల్గొన్నారు.

## బోనాల ప్రత్యేక అలంకరణలో చిన్నారులు

## కనకదుర్గ, గోదాదేవి, భారత్ మాత అవతారలలో చిన్నారులు



**ఖమ్మం/తల్లాడ ఆగస్టు 10 ప్రజాబలం:**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బోనాల జాతరలో తల్లాడ చిన్నారులు ప్రత్యేక అవతారాలలో కనిపించారు. తల్లాడ పట్టణానికి చెందిన పలు చిన్నారులు కనకదుర్గ, గోదాదేవి, భారత్ మాత అవతారంతో బోనాలు జాతరలో పాల్గొన్నారు. సాక్షాత్తు అమ్మవారి అవతారాలతో పలువురుకి అమ్మవారి దర్శనం కల్పించి ప్రత్యేక అలంకరణగా నిలిచారు. చిన్నారులను ప్రత్యేకంగా అలంకరించిన బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలను ప్రత్యేకంగా అభినందించారు.

## తిమ్మాపూర్‌శ్రీ ఎస్ ఐ ఆర్ జాబితా నిర్ధారించుట కొరకు సమావేశం పాల్గొన్న జూనియర్ అసిస్టెంట్ కనకారావు



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఎస్ ఐ ఆర్ జాబితా నిర్ధారించుట కొరకు సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ డిపార్ట్మెంట్ జూనియర్ అసిస్టెంట్ కనకారావు సమావేశంలో పాల్గొనడం జరిగింది గ్రామంలో 100% అందరూ నమోదు కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతం చేయాలని అందుకు గ్రామ అధికారులు నాయకులు ప్రతి ఒక్కరు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జూనియర్ అసిస్టెంట్ కనకరావు తెలిపారు తదుపరి అనంతరం సిసి కెమెరాలు అమర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మర్పల్లి ఎస్సై రవుఫ్, మరియు గ్రామ సర్పంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని సీసీ కెమెరాలను ప్రారంభోత్సవం చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ వార్డు మెంబర్స్ యువకులు గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు

## మేడారం ఆలయ తుది దశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### అధికారుల సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి మంత్రి డ దనసరి అనసూయ సీతక్క

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి** మేడారం జూన్ 10 2026మేడారం ఆలయంలో చేపట్టిన తుది దశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.



సోమవారం తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క--సారలమ్మ వనదేవతలను మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మేడారంలో చేపడుతున్న ఏర్పాట్లను, ఆలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనులను పరిశీలించిన మంత్రి, వాటి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్‌కు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి, భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈవో కార్యాలయ పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి 16వ తేదీన పర్యటించనున్న సందర్భంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం ఆలయ తుది దశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### అధికారుల సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి మంత్రి డ దనసరి అనసూయ సీతక్క

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మేడారం ఆగస్టు 10 2026**మేడారం ఆలయంలో చేపట్టిన తుది దశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.



సోమవారం తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క--సారలమ్మ వనదేవతలను మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మేడారంలో చేపడుతున్న ఏర్పాట్లను, ఆలయ



అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనులను పరిశీలించిన మంత్రి, వాటి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్‌కు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి, భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈవో కార్యాలయ పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి 16వ తేదీన పర్యటించనున్న సందర్భంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## "జ్యోతిర్లింగాలు మరియు పద్దెనిమిది మహాశక్తిపీఠాల పౌరాణిక కథనాలు" ఆవిష్కరణ



భారతీయ ఆంగ్ల రచయిత్రి డాక్టర్ శిఖా భట్నాగర్ రచించిన ఆరవ పుస్తకం, "జ్యోతిర్లింగాలు మరియు పద్దెనిమిది మహాశక్తిపీఠాల పౌరాణిక కథనాలు" ఆవిష్కరణ కార్యక్రమం బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి కంపెనీ అధికారి సుధాకర్, నగరంలోని ప్రఖ్యాత చర్మవ్యాధి నిపుణుడు ముఖేష్‌రాజ్ శ్రీవాస్తవ, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ, మరియు ప్రముఖ సంఘ సేవకుడు, రక్తదాత యోగేష్‌రాజ్ శ్రీవాస్తవ హాజరయ్యారు. డాక్టర్ శిఖా తాను రచించిన ఒక కవితతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

డిజిటల్ తెరలకే పరిమితమైన యువతరాన్ని పుస్తక పఠనం, రచనల వైపు ఆకర్షించడంతో పాటు, వారికి భారతీయ మరియు సనాతన సంస్కృతిని పరిచయం చేయడమే భారతీయ ఆంగ్ల రచయిత్రి డాక్టర్ శిఖా లక్ష్యం. నోషన్ ప్రెస్ ప్రచురించిన ఈ పుస్తకంలో, రచయిత్రి పన్నెండు జ్యోతిర్లింగాల కథ మరియు మూలాలపై వెలుగునిచ్చారు. ఆదిగురు శంకరాచార్యులు రచించిన పద్దెనిమిది స్తోత్రాల ఆధారంగా ఏర్పడిన పద్దెనిమిది మహాశక్తిపీఠాల గురించిన సమాచారాన్ని చిత్రాలతో సహా అందించారు.

వేదికపై ఉన్న సభ్యులు తమ ప్రసంగాలలో రచయిత రచనపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. స్వాతి శ్రీవాస్తవ రచయితను పరిచయం చేశారు. ప్రముఖ పాత్రికేయుడు అతుల్ శ్రీవాస్తవ శివుడు మరియు శివ తత్వంపై తన ఆలోచనలను ప్రేక్షకులతో పంచుకున్నారు.

### పెద్ది సుదర్శన్ రెడ్డికి కేటీఆర్ నివాళి

హైదరాబాద్, ఆగస్టు 10 బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు" అని వ్యాఖ్యానించారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com